ఎన్నాళ్లీ యాతన..!

- దుమ్ము ధూళితో ప్రజల ఇబ్బందులు
- నత్తనడకన ఆర్‌వోబీల నిర్మాణం
- రెండేళ్లుగా పీలేరు ప్రజలకు తప్పని ఇక్కట్లు



చిత్తూరు మార్గంలో మందకొడిగా సాగుతున్న అండర్ పాస్ నిర్మాణం, పక్కనే రోడ్డును కమ్మేస్తున్న దుమ్ము

పీలేరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా పీలేరు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డెక్కాలంటేనే భయపడుతున్నారు. దుమ్ము, ధూళితో అనేక ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పీలేరుకు రావాలంటేనే భయపడుతుండటంతో వ్యాపారాలు జరగక వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దీనికంతటికీ కారణం రెండేళ్లుగా పీలేరులో జరుగుతున్న ఆర్‌వోబీల నిర్మాణమే. పనులు నత్తనడకన జరుగుతుండటంతో రోడ్డెక్కాలంటే ప్రజలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పనుల నిర్వహణలో అడుగడుగునా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పీలేరుకు రావాలంటేనే ప్రయాణీకులు, వాహన చోదకులు, పాదచారులు భయపడుతున్నారు. ప్రధానంగా పట్టణ ప్రజలు దుమ్ము, ధూళితో రోగాల బారినపడుతున్నారు. రెండేళ్లుగా రైల్వే వంతెన నిర్మాణాల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా జరుగుతున్నాయి. పీలేరు పట్టణ నడిబొడ్డున తిరుపతి-మదనపల్లె, చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారులలో రైల్వే క్రాసింగ్‌లు ఉన్నాయి. దినదిన ప్రవర్తమానంగా పట్టణ విస్తరణ, వాహనాల రాకపోకలు అమాంతం పెరగడంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. దీంతో ఇరుమార్గాలలో ఆర్‌వోబీల నిర్మాణం కోసం రూ.134.90 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇందులో మదనపల్లె-తిరుపతి రహదారిలో రూ.66.65 కోట్లు, చిత్తూరు-కర్నూలు మార్గంలో రూ.68.25 కోట్లు వేర్వేరుగా మంజూరు చేశారు. త్వరితగతిన భూసేకరణ పూర్తి చేసి రైల్వేవంతెనల నిర్మాణానికి సహకరించాల్సిన రెవెన్యూ అధికారులు తీవ్ర జాప్యం చేశారన్న విమర్శలున్నాయి. రహదారి నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కోల్పోయే బాధితులకు సకాలంలో నష్టపరిహారం చెల్లించకుండానే ఇంజనీరింగ్ అధికారులు పనులు చేపట్టడంతో కొందరు బాధితులు కోర్టుకు వెళ్లడంతో మరింత జాప్యం జరుగుతోంది. మదనపల్లె మార్గంలో రైల్వే గేటుకు ఇరువైపులా రెండు మినహా మిగతా పిల్లర్ల నిర్మాణం పూర్తి చేశారు. చిత్తూరు మార్గంలో పనుల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. మరో రెండేళ్లు అయినా పనులు పూర్తవుతాయా అన్న అనుమానం పట్టణ ప్రజల్లో నెలకొంది. ఎక్కడ పడితే అక్కడ రహదారి పక్కన గోతులు తీసివేయడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పట్టణంలో సర్వీస్ రోడ్డు లేకుండానే వంతెన నిర్మాణ పనులు జరుగుతుండడం గమనార్హం. మదనపల్లె మార్గంలో వంతెన నిర్మాణ పనులు పూర్తయితే 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే పట్టణమంతా చుట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

పూర్తిగా దెబ్బతిన్న వ్యాపారాలు...

రైల్వే వంతెన నిర్మాణ పనులు మందకొడిగా కొనసాగుతుండడంతో పీలేరులో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దుకాణాలు రహదారులకు ఇరువైపులా ఉండడంతో నిత్యం దుమ్ము, ధూళితో నిండిపోతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు సైతం పీలేరు పట్ల మక్కువ చూపడం లేదు. దీంతో రెండేళ్లుగా నష్టాలు చవిచూడాల్సిన దుస్థితి సర్వత్రా నెలకొంది. మరోవైపు ప్రజలు తీవ్ర శ్వాసకోశ వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు.

మదనపల్లె మార్గంలో పూర్తయిన పిల్లర్ల నిర్మాణం





చిత్తూరు మార్గంలో ఏడాదిగా ముందుకు సాగని రహదారి పనులు



ఆర్‌వోబీల నిర్మాణానికి చిత్తూరు-మదనపల్లె మార్గంలో ఉన్న రైల్వే గేట్లు



మదనపల్లె మార్గం అజంతామిట్ట వద్ద రహదారి లోడేసిన దృశ్యం

అధికారుల సమన్వయ లోపం..



అధికారుల సమన్వయ లోపం వల్లే ఆర్‌వోబీల నిర్మాణంలో జాప్యానికి నిదర్శనం. నత్తనడకన పనులు జరుగుతున్నాయి. ఊరి మధ్యలో ఫ్లైఓవర్ పనులు ముందుకు సాగకపోవడం శోచనీయం. నిత్యం దుమ్ము, ధూళితో ఊరు మొత్తం నిండిపోవడంతో పిల్లలు, పెద్దలు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి పనులు వెంటనే పూర్తి చేసేలా చూడాలి.

- డాక్టర్ రూపేష్ కుమార్‌రెడ్డి, పీలేరు

ఎక్కడపడితే అక్కడ లోడేస్తున్నారు..



రైల్వే వంతెనల నిర్మాణంతో పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ లోడేస్తుండడంతో పంచాయతీకి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ప్రధానంగా మంచినీటి పైపులు పలుచోట్ల పగిలిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కాంట్రాక్టర్‌కు ఫోన్ చేస్తే సకాలంలో స్పందించడం లేదు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. నిత్యం పట్టణం దుమ్ము, ధూళితో నిండిపోతోంది.

- గురుమోహన్, ఈవో, మేజర్ గ్రామ పంచాయతీ, పీలేరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి



త్వరలో 'అన్నమయ్య'లోకి పుంగనూరు

- ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని త్వరలో అన్నమయ్య జిల్లాలో కలపనున్నారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. పీలేరులో సోమవారం జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు. గతంలో పార్లమెంటు సెగ్మెంట్ల ప్రాతిపదికన జిల్లాల విభజన జరిగినప్పటికీ రాజకీయ కారణాలతో పుంగనూరు నియోజకవర్గాన్ని చిత్తూరు జిల్లాలో కొనసాగించారని ఆయన తెలిపారు. పుంగనూరు నియోజకవర్గ ప్రజల ఇబ్బందులను గమనించిన కూటమి ప్రభుత్వం ఆ నియోజకవర్గాన్ని పరిపాలన, ప్రజల సౌలభ్యం కోసం అన్నమయ్య జిల్లాలోకి కలపనుందని ఆయన తెలిపారు. జిల్లాలోకి పుంగనూరు కలవడం వల్ల అటు ప్రభుత్వ పరంగానూ, ఇటు పార్టీ పరంగానూ తమకు అదనపు బలం చేకూరుతుందని తెలిపారు. మహానాడు తరువాత రాయలసీమ జిల్లాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ కార్యాచరణ సిద్ధం చేశారని తెలిపారు. రాయలసీమను ఉద్యాన, డెయిరీ, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అనేక ప్రాజెక్టులు తెస్తున్నారన్నారు. మహానాడు వేదిక ద్వారా వాటిని ప్రకటించే అవకాశం ఉందన్నారు. వైసీపీ పాలకుల నియంతృత్వ, బెదిరింపు ధోరణి కారణంగా రాష్ట్రం నుంచి అనేక పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోయాయని, ప్రస్తుతం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్ కారణంగా చాలా సంస్థలు తమ యూనిట్లు ఏపీలో నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. మహానాడును రాయలసీమ జిల్లాల పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడి వాటిని బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. లక్కిరెడ్డిపల్లె మండలం దిగువ రామాపురం గ్రామానికి చెందిన లలితారాణి రేషన్‌కార్డు ఆన్‌లైన్‌లో తన పేరు చూపిస్తున్నా కూడా రేషన్ ఇవ్వడం లేదని పరిశీలించి సమస్యను పరిష్కరించి రేషన్ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. వీరబల్లి మండలం సోమవరం గ్రామం బోయపాటివాండ్లపల్లెకు చెందిన పరిటాల ఆదెమ్మ తనకు వితంతు పింఛన్‌ను పునరుద్ధరించాలని కలెక్టర్‌కు విన్నవించారు. పీలేరు పట్టణానికి చెందిన సలీమా బీపీఎల్‌కు చెందిన తమకు ఉన్న సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకోవడానికి ప్రభుత్వం ద్వారా ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

26 నుంచి టీకాలపై ప్రత్యేక శిబిరాలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ ఉషశ్రీ



రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మీజిల్స్, రూబెల్లా (తట్టు, గవద బిళ్లల) టీకాల ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 2026 సంవత్సరం పూర్తి నాటికి దేశం నుంచి తట్టు, గవద బిళ్లల వ్యాధులను తరిమివేయాలనే లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది మూడు విడతల్లో స్పెషల్ డ్రైవ్ చేపడుతోందని తెలిపారు. మొదటి విడత ఈనెల 26 నుంచి 31 వరకు, రెండో విడత జూన్ 23 నుంచి 28 వరకు, మూడో విడత జూలై 21 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తట్టు, రూబెల్లా రెండు జబ్బులు ప్రమాదకరమైన వైరస్ జబ్బులని, ఈ రెండు జబ్బులు పిల్లల్లో న్యూమోనియా, డయేరియా, మెదడు ఇన్ఫెక్షన్‌లకు దారితీసి ఒక్కోసారి మరణం కూడా సంభవింపజేస్తాయన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో ఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకోని వారిని గుర్తించి సర్వే చేసి వారికి ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వలస వెళ్లే వారు, మురికివాడల్లో నివసించే వారు, ఇటుక బట్టీల దగ్గర ఉండే వారు, భవన నిర్మాణం దగ్గర ఉండేవారిని ఆరోగ్య సిబ్బంది ప్రత్యేకంగా గుర్తించి వారికి టీకాలను వేయాలని తెలిపారు. జిల్లాలో తట్టు, గవద బిళ్లల కేసులు లేకుండా చేసే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న చాందినీ బండ్లు

- ముగిసిన యల్లమ్మ జాతర



జాతర సందర్భంగా చాందినీ బండ్ల ఊరేగింపు

పీలేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల అలంకరణ, హోరెత్తించే భక్తి, సినిమా పాటల డీజేలతో అలంకరించిన చాందినీ బండ్ల ఊరేగింపుతో కేవీపల్లె మండలం గర్నిమిట్టలోని యల్లమ్మ జాతర సోమవారం మధ్యాహ్నం ముగిసింది. చాందినీబండ్ల ఊరేగింపునకు పెట్టింది పేరైన గర్నిమిట్ట జాతర పేరుకు తగ్గట్లుగా ఈ ఏడాది పీలేరు, కేవీపల్లె, కలకడ మండలాలకు చెందిన 30 మంది భక్తులు చాందినీబండ్లు కట్టారు. సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు ప్రారంభమైన చాందినీబండ్ల ఊరేగింపు సోమవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ప్రతి బండికి అమ్మవారి ఆలయం ముందు పూజలు చేశారు. చాందినీ బండ్ల ఊరేగింపుతో కేవీపల్లె-సుండుపల్లె మార్గం పూర్తిగా భక్తులతో కిటకిటలాడింది. ముగింపు సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కేవీపల్లె ఎస్‌ఐ చిన్నరెడ్డయ్య నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ప్రశాంతంగా ముగిసింది.

కుదేలవుతోన్న టమోటా రైతు

- ధర లేక టమోటాలను రోడ్డు పక్కన పడేస్తున్న రైతులు
- కూలీల ఖర్చులూ రాని వైనం

6



మహిళ హత్య కేసు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



హత్య కేసులో ముగ్గురి అరెస్టు

- మహిళను అతి దారుణంగా హత్య చేసిన నిందితులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మహిళను అతి దారుణంగా హత్య చేసిన ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కేసు వివరాలను మీడియాకు తెలిపారు. మదనపల్లి మండలం వేంపల్లి పంచాయతీ జంగాలపల్లికి చెందిన వెంకట్రమణ భార్య బూచిపల్లి శివమ్మ మదనపల్లె పట్టణం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన సంతోశ్‌తో వెళ్లిపోయిందన్నారు. తమ కుటుంబ పరువు తీసిందన్న ఆగ్రహంతో శివమ్మ ఆడబిడ్డ నీలావతి, ఆమె బంధువైన కన్నెమడుగు గణేశ్, బెంగుళూరులోని సజ్జాపురం ఏరియా అంబేడ్కర్ కాలనీకి చెందిన హెచ్‌వీ గోపాల్‌తో కలిసి హత్య చేసేందుకు పథకం పన్నిందన్నారు. శివమ్మను మదనపల్లె రూరల్ రామసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల చెంబుకూరు ఎలకపల్లి రహదారిలో కాళ్లు, చేతులు కట్టేసి మెడకు తాడు బిగించి పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారని తెలిపారు. అనుమానాస్పద మృతి కింద ఈనెల 12వ తేదీ కేసు నమోదు చేసిన రామసముద్రం పోలీసులు మదనపల్లి డీఎస్పీ మహేంద్ర, రూరల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, రామసముద్రం ఎస్‌ఐ రవికుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసులు మహిళ కుడి చేతిపై ఉన్న యస్మిత అన్న పచ్చబొట్టును ద్వారా దర్యాప్తు చేశారన్నారు. నిందితులను ఆదివారం సాయంత్రం రామసముద్రం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అరెస్టు చేసి విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరు పెట్టినట్లు వివరించారు.

జిల్లాలో రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్

- జిల్లా వ్యాప్తంగా 10 వేల ఎకరాల సేకరణకు యత్నాలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపార సంస్థ రిలయన్స్ జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటును ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 10వేల ఎకరాల భూసేకరణకు జిల్లా ఉన్నతాధికారులు యత్నాలు చేస్తున్నారు. సుమారు రూ.65వేల కోట్ల పెట్టుబడితో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని రిలయన్స్ సంస్థ ప్రయత్నిస్తోన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోనూ ఈ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు అనువైన భూముల వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములు, సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా వ్యవసాయం చేయడం ఇష్టం లేని రైతులు లేదా వ్యవసాయం చేయడం అవకాశం లేని రైతుల నుంచి సైతం ప్రైవేటు భూముల సేకరణకు కూడా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇలా భూములు ఇచ్చిన ప్రైవేటు వ్యక్తులకు ఏడాదికి ఎంతో కొంత గుత్త (అద్దె) చెల్లించే ఆలోచనలో రిలయన్స్ సంస్థ ఉన్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, చెరుకు చెత్త, మునిసిపల్ ఘనవ్యర్థాలు, మురుగునీటి శుద్ధి కర్మాగార వ్యర్థాలు మొదలైన వాటితో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల రిలయన్స్ సంస్థ ఈ సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ప్లాంట్ల ఏర్పాటుకు పది వేల ఎకరాల వివరాలను అధికారులు సేకరిస్తుండగా అందులో మూడు నుంచి నాలుగు వేల ఎకరాలను రిలయన్స్ సంస్థ తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగం అందించే స్థాయికి ఎదగాలి

- మంత్రి సవిత
- కడపలో పీ4 స్టార్టప్ కేంద్రానికి శంకుస్థాపన

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 19 (ఆంధ్రజ్యోతి): యువత ఉద్యోగం అందుకునే స్థాయి నుంచి అందించే స్థాయి వరకు ఎదగాలన్న దే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అన్నారు. కడప ఆర్ట్స్ కళాశాల సమపంలో ఏర్పాటు కానున్న స్టార్టప్ కడప ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ (పీ4) నిర్మాణానికి సోమవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి అంటేనే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది చంద్రబాబు నాయుడు అన్నారు. ఆశించే స్థాయి కంటే శాసించే స్థాయికి ఎదగాలంటే ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్టప్ ఎదగాలనే ఆయన ఆలోచన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఇలాంటి స్టార్టప్ కార్యక్రమం ప్రప్రథమంగా మన జిల్లాలో ఏర్పాటు కావడం అదృష్టమన్నారు. 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీప్లస్-3 అంతస్తులతో పీఈబీ టెక్నాలజీ ఆధారంగా ఈ కేంద్రం భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాయలసీమ జిల్లా ల్లోని యువత కడప కేంద్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఈ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ రూ.4కోట్లు విరాళం ఇచ్చిందన్నారు. స్టార్టప్ కడప కేవలం ఒక భవనం మాత్రమే కాదని ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక అన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను, బిల్డింగు నమూనాను మ్యాప్ ద్వారా వివరించారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం నడిబొడ్డున ఉన్న కడప నగరంలో ఇలాంటి కేంద్రం ఏర్పాటు కావడంతో సాంకేతిక విద్యానైపుణ్యం ఉన్న ప్రతి విద్యార్థికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి మాట్లాడుతూ నేటి యువత బంగారు భవిష్యత్తుకు ఈ ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ సీఎం సరికొత్త ఆలోచనలకు కడప నగరం వేదిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ పంచాయతీరాజ్, బీసీ సంక్షేమ శాఖ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పీ4 స్టార్టప్ కేంద్ర సముదాయం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆర్.మాధవి.. చిత్రంలో కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

స్కూటరు ఢీకొని మహిళ మృతి

మదనపల్లె అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): స్కూటరు ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, పాతబోలు హరిజనవాడకు చెందిన రమణమ్మ(55) కూలి పనులకు వెళ్లి ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వెళుతున్న ఆమెను పోతబోలు సమీపంలో స్కూటర్ ఢీకొని తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త గతంలో చనిపోవడం, ఒక్క కుమారుడు మాత్రమే ఉండడంతో మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. అనంతరం దహనక్రియలు చేసేందుకు ప్రయత్నించారు. ఈ సమాచారాన్ని స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం మహిళ మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

పాముకాటుతో వ్యక్తి...



మృతిచెందిన వెంకట్రమణ

లక్కిరెడ్డిపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిరేవుల పంచాయతీలోని రెడ్డివారిపల్లెకు చెందిన వీరబల్లి వెంకట్రమణ (44) సోమవారం పాముకాటుకు గురై మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వారి వివరాల మేరకు.. మృతుడు వెంకట్రమణ రోజు కూలి పనికి వెళ్లి జీవనం సాగించేవాడని, ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా కట్లపాము వచ్చి కాటు వేసిందని, దీంతో హుటాహుటిన స్థానికులు వెంకట్రమణను రాయచోటి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, భార్య జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లిందని తెలిపారు. కుటుంబ సభ్యులు, పిల్లలు శోక సంద్రంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి...



మహమ్మద్ (ఫైల్‌ఫోటో)

సుండుపల్లె, మే 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రాయవరానికి చెందిన సర్పంచ్ షరీఫ్ తమ్ముడు షేక్.మహమ్మద్ (27) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు... రాజంపేట నుంచి ద్విచక్రవాహనంలో షేక్.మహమ్మద్, మరో యువకుడు రాయవరానికి వస్తుండగా.. సుండుపల్లె వైపు నుంచి సానిపాయి వెళ్తున్న టెంపో వాహనం మడితాడు గ్రామ పంచాయతీ కృష్ణారెడ్డి చెరువు వద్ద ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతి చెందిన యువకుడు ఎంటెక్ చదువుతున్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మినీ లారీ- కారు ఢీ

● ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో లారీ బోల్తాపడడంతో నేలపాలైన టమోటాలు

కురబలకోట, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మన్నబావి సమీపంలో మినీ లారీ, కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన వారు కారులో కదిరిరోడ్డు వైపున వెళుతున్నారు. కాగా బి.కొత్తకోట మండలం గట్టుకు చెందిన రైతులు తమ పొలంలో కోసిన టమోటాలను బాక్సులో మార్కెట్ తరలించడానికి మినీ లారీలో బయలుదేరారు. కాగా దొమ్మన్నబావి సమీపంలో కారు లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కాగా లారీ బోల్తా పడటంతో టమోటాలు నేలపాలయ్యాయి. ప్రమాదంలో కారు దెబ్బతినడంతో పాటు ప్రయాణిస్తున్న మహిళ గాయపడంతో 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అలాగే లారీలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. కాగా ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు నాటుసారా

తయారీదారుల అరెస్టు

- 310 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం



పట్టుబడ్డ నిందితులతో రాయచోటి ఎక్సైజ్ పోలీసులు

రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంబేపల్లి మండలం శెట్టిపల్లి పెద్దబిడికి అటవీ ప్రాంతంలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు మెరుపు దాడులు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్ ఆదేశాల మేరకు రాయచోటి ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర పర్యవేక్షణలో రాయచోటి ఎక్సైజ్ సీఐ హిమబిందు, ఎస్ఐ శశిధర్, సిబ్బంది రామయ్య, మోహన్‌రెడ్డి, రాజశేఖర్, విఘ్నేశ్, హుస్సేన్ తదితరులు శెట్టిపల్లి పెద్దబిడికి అటవీ ప్రాంతంలో దాడులు చేశారు. అక్కడ నాటుసారా తయారు చేస్తున్న పెద్దబిడికి చెందిన బుక్కే భాగ్యమ్మ, బుక్కే గోబీరమ్మ అనే మహిళలను అరెస్టు చేయడంతో పాటు నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 310 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసి నిందితులను కోర్టుల్లో హాజరు పెట్టినట్లు ఎక్సైజ్ సీఐ తెలియజేశారు.

చికిత్స పొందుతూ..

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఇతను వారం రోజుల క్రితం అనారోగ్యంతో ములకలచెరువు నుంచి 108 వాహనంలో వచ్చి మదనపల్లెలో చికిత్స తీసుకుంటూ ఉండేవాడు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, మృతదేహాన్ని మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు.

ధరలు లేకపోవడంతో తంబళ్లపల్లెలో రోడ్డు పక్కన గుట్టలుగా పోసిన టమోటాలు



నిమ్మనపల్లెలో టమోటాలను కోయకుండా వదివేసిన దృశ్యం



కుదేలవుతోన్న టమోటా రైతు

● ధర లేక టమోటాలను రోడ్డు పక్కన పడేస్తున్న రైతులు

● కూలీల ఖర్చులూ రాని వైనం

టమోటా ధరలు గణనీయంగా పడిపోవడంతో పంట సాగు చేసిన రైతులు కుదేలవుతున్నారు. కాయలను మార్కెటుకు తీసుకువెళ్తే కూలీల డబ్బులు సైతం రావడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇక చేసేదేమి లేక పండిన టమోటా పంటను కొందరు రైతులు పొలాల్లోనే వదిలేస్తుండగా.. మరికొందరు రైతులు కాయలను రోడ్డు పక్కన పారబోస్తున్నారు. దిగుబడులు బాగున్నా ధరలు పతనం కావడంతో లబోదిబోమంటున్నారు.



ధర లేకపోవడంతో టమోటాలను రోడ్డు పక్కన పడేస్తున్న రైతు

తంబళ్లపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేరుశెనగతో పాటు టమోటాను ఎక్కువగా సాగు చేస్తారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సుమారు 3000 ఎకరాలకు పైగా టమోటా సాగులో ఉందని అధికారుల అంచనా. గత ఏడాది చివరి వరకు టమోటా ధరలు ఆశాజనకంగానే ఉన్నా ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో 30 కేజీల బాక్సు ధర కాయల నాణ్యతను బట్టి రూ.40 నుంచి రూ.50 వరకు ఉందని టమోటా రైతులు చెబుతున్నారు. దున్నకం, నారు, కూలీలు, మందులు, రావాణా అన్నీ కలిపి ఎకరాకు సుమారు రూ.1.2 నుంచి రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం టమోటాకు ధర లేకపోవడంతో కాయలు కోసి మార్కెట్టుకు తీసుకువెళ్తే కూలీల డబ్బులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని పరుసతోపు పంచాయతీ పేండేరివారిపల్లెకు చెందిన రైతు మల్లప్ప రెండు ఎకరాల్లో రూ.2.5 లక్షలు పైగా ఖర్చు చేసి టమోటా పంట సాగు చేశాడు. పంట దిగుబడి బాగా వచ్చింది. రైతు నాలుగు రోజుల కిందట కూలీలతో పంటను కోయగా రెండు ఎకరాల్లో సుమారు 160కి పైగా బాక్సులు కోతకు వచ్చాయి. కాయలను మార్కెట్టుకు తరలించగా 30 కేజీల బాక్సు ధర రూ.40 నుంచి 50 పలికింది. ఈ ధరతో కాయలు కోసిన కూలీలకు పెట్టిన ఖర్చు కూడా రాదని ఆగ్రహించిన రైతు కాయలను తీసుకువచ్చి గ్రామానికి సమీపంలోని రోడ్డు పక్కన కాలువలో పారబోశాడు. కాసుల వర్షం కురిపిస్తుందన్న టమోటా చివరకు కూలీల ఖర్చులు సైతం రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి టమాటాకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ధరలు తగ్గడంతో క్రేట్లలో నిల్వ వున్న టమోటాలు

అధిక దిగుబడులతో ధరలు పతనం

నిమ్మనపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఈ ఏడాది అధికంగా టమోట పంటలు వేయడంతో ధరలు పతనమయ్యాయి. హార్టికల్చర్ అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 700 హెక్టార్లలో టమోట పంట సాగైనట్లు తెలుస్తోంది. ఒక ఎకరా టమాట పంటను పండించాలంటే దాదాపు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు రైతు ఖర్చు చేయాల్సి వుంటుంది. ప్రస్తుతం కలికిరి టమోట మార్కెట్‌లో 30 కేజీల టమాట ధర కేవలం రూ.50 పలికినట్లు రైతులు తెలిపారు. సరాసరి రెండు రోజుల క్రితం దాదాపు రూ.200 వున్న టమోట ధర నేడు రూ.50కి పడిపోవడంతో రైతులు డీలా పడ్డారు. కొందరు రైతులు ధర పతనం కావడంతో కాయలు కోయకుండా చెట్లలోనే వదిలేస్తున్నారు. దీనికి తోడు సాఫ్ట్‌వేర్, రిటైర్డ్, స్థానికంగా పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు సైతం వందల ఎకరాలను కొనుగోలు లేదా కౌలుకు తీసుకొని టమోట పంటలు పండిస్తుండడంతో సామాన్య రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ సారైనా ధరలు వుంటాయని వడ్డీలకు తెచ్చి ఖర్చు చేశారు. ఇదిలా వుంటే కోసిన కాయలను మార్కెట్‌కు తరలిస్తే కమీషన్, కూలీలు, బాడుగలకు పోయి ఒక్క పైసా కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు. కొందరు రైతులు మాట్లాడుతూ.. ఈ సారి ధర కనీసం రూ.400ల కంటే తక్కువ పోతే ఆత్మహత్య చేసుకొంటామని చెబుతున్నారు. ప్రభుత్వం నికర ధరను ప్రకటించి రైతులను ఆదుకొంటే తప్ప బాగుపడే పరిస్థితి కనిపించడం లేదు.

ధరలు లేకపోతే ఆత్మహత్యే



టమోట ధరలు ఇలాగే కొనసాగితే మాకు ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదు. పంటకు నీరు కడితే ఎక్కడ రంగు మారుతాయో అని నీరు కూడా పెట్టడం లేదు. పైగా వైరస్ వ్యాప్తి ఎక్కువగా వుండడంతో మందులకు అధిక మొత్తం చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం రైతును ఆదుకోవాలి.

-శ్రీనివాసులు, గౌనిగారిపల్లి, నిమ్మనపల్లి

కడప వినియోగదారుల కమిషన్‌లో..

ఛైర్మన్ సహా సభ్యురాలి తొలగింపు

కలికిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా వినియోగదారుల కమిషన్ ఛైర్మన్‌తో పాటు మరో మహిళా సభ్యురాలిని తొలగిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తుది ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు.. కడప జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిగా తప్పా అబ్దుల్‌రసూల్‌ను నియమిస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం 2022 ఫిబ్రవరి 3న ఆదేశాలు జారీ చేసింది. నాలుగేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయనతో పాటు కమిషన్‌లో మహిళా సభ్యురాలుగా అదే కాల పరిమితితో దండు అమృతను కూడా నియమించారు. ఈ రెండు నియామకాలకు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 5న ఇరువురూ బాధ్యతలు కూడా చేపట్టారు. కాగా అధ్యక్షుడు రసూల్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ వి.సుబ్బారెడ్డి, కలికిరి శిరీషాలు రాష్ట్ర హైకోర్టులో ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేశారు. అధ్యక్షుడి అర్హతలు, నియామకపు ప్రక్రియ, పద్ధతులను ప్రశ్నిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అదే విధంగా దండు అమృత నియామకాన్ని సవాలు చేస్తూ వేదల చంద్రవదన అనే మహిళ కూడా హైకోర్టును ఆశ్రయించారు. ఈ రెండు నియామకాలను వేర్వేరుగా విచారించిన హైకోర్టు చివరకు ఇరువురి నియామకాలు చెల్లవంటూ 2024 నవంబరు 15న తీర్పు వెల్లడించింది. ఈ మేరకు తగిన ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిం చింది. ఈ లోగా హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులను సవాలు చేస్తూ అబ్దుల్ రసూల్, దండు అమృతలు వేర్వేరుగా హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. రెండు నియామకాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు సహేతుకమేనని ఆ తీర్పును సమర్థిస్తూ ఈ ఇరువురి రిట్ అప్పీళ్లపై 2025 ఏప్రిల్ 25 డివిజన్ బెంచ్ తుది తీర్పు వెలువరించింది. దీనికి అనువుగా రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది. డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు వీరి నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను రద్దు చేస్తూ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు అబ్దుల్ రసూల్, మహిళా సభ్యురాలు దండు అమృతలను పదవుల నుంచి వైదొలగాల్సిందిగా ఆదేశిస్తూ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి సౌరబ్ గౌర్ సోమవారం విడివిడిగా ఉత్తర్వులు జారీ చేశారు.

దౌర్జన్యం చేస్తున్న గ్యాంగ్‌పై చర్యలు తీసుకోండి

● ఎస్పీకి మదనపల్లె బాధితుల వేడుకోలు



మీడియా ఎదుట వాపోతున్న మదనపల్లె బాధితులు

రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రూ.మూడున్నర కోట్లకు పైగా పలువురి దగ్గర అప్పులు తీసుకొని అప్పు ఇచ్చిన వారిపైనే దౌర్జన్యానికి పాల్పడుతూ బెదిరింపులకు గురిచేస్తున్న గ్యాంగ్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ మదనపల్లికి చెందిన సుమారు 30 మందికి పైగా బాధితులు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు తమ గోడును విన్నవించారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం బాధితులు మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని మదనపల్లి పట్టణానికి చెందిన రమేశ్ భార్య కందుల సుజాత.. ఆమె కుమారుడు కందుల సునీల్, నరేంద్ర భార్య సుంకర లావణ్య, పద్మప్రియ, గౌరీ, నాగరత్న, నలిని, నాగమణి తదితరులతో కలిసి పట్టణంలో ఉండే ఒంటరి మహిళలను, ఫ్యామిలీలను, వృద్ధులను టార్గెట్ చేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, పిల్లలకు ఫీజు కట్టాలని నమ్మబలికి వారి వద్ద నుంచి అప్పు తీసుకుంటూ ఉండేది. ఇలా 30 మందికి పైగా మూడున్నర కోట్ల వరకు సుజాత అప్పు తీసుకుందన్నారు. అప్పు ఇచ్చిన వారు డబ్బులు అడిగితే పైన కనబరిచిన గ్యాంగ్‌తో వారి ఇంటి వద్దకు వెళ్లి వారిని నానా రకాలుగా దూషించడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసి అవమానకరంగా మాట్లాడుతోందని వాపోయారు. సుజాత గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడుతుండటంతో భరించలేక సమస్యను కోర్టుకు వేశామని, అయితే తమపైనే కోర్టులో వేస్తారా అంటూ మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. అదేవిధంగా ఏకాంబర్ రెడ్డి అనే అతని వద్ద రూ.60 లక్షలు అప్పు తీసుకుని వారి ఇంట్లో ఉంటూ బాడుగ అడిగినందుకు మదనపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై రేప్ కేసు పెట్టిందని మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అందరి దగ్గర అప్పులు తీసుకొని ఆమె దుబాయ్ వెళ్లిపోయిందని, పులివెందులలో కూడా ఆమెపై కేసు ఉందని వారు వివరించారు. జిల్లా పోలీసులు విచారించి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా మృత్యుంజయేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మదనపల్లెఅర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మచెరువు మిట్టలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కంచి కామకోటి పీఠాధిపతులచే స్వామివారి నూతన విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో పద్మశాలి సేవా సంఘం, ఆలయకమిటీ సభ్యులచే హోమాలు, విశేషంగా పూజలు నిర్వహించారు. ఆలయాన్ని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఆలయ ఆవరణంలో ధ్వజ స్తంభం, నాగదేవతలు, వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు, పద్మశాలి సేవా సంఘం సభ్యులు పర్యవేక్షించారు.



మృత్యుంజయేశ్వర స్వామి విగ్రహం

పీలేరు ఏఎంసీ పాలకవర్గం నియామకం



పురం రామ్మూర్తి, సురేంద్రరెడ్డి

పీలేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఏఎంసీ గౌరవాధ్యక్షుడిగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, అధ్యక్షుడిగా పురం రామ్మూర్తి(పీలేరు), ఉపాధ్యక్షుడిగా పి.సురేంద్రరెడ్డి (కేవీపల్లె) నియమితులయ్యారు. పీలేరు, కేవీపల్లె మండలాల పరిధిలోని పీలేరు ఏఎంసీకి సభ్యులుగా ఎస్.సుబ్బయ్య (పీలేరు), ఎం.కృష్ణమూర్తి (పీలేరు), పి.రహంతుల్లా(పీలేరు), ఎస్.శివమ్మ(పీలేరు), ఒ.రమాదేవి(పీలేరు), ఎం.సాధన(పీలేరు), ఎం.రజనీ(పీలేరు), ఎస్.అమరనాథరెడ్డి(పీలేరు), కలప రవి (పీలేరు-జనసేన), జి.కిశోర్ నాయుడు(పీలేరు), ఎ.వనిత(పీలేరు), టి.లక్ష్మీకాంతమ్మ(పీలేరు), జి.అనూరాధ(పీలేరు) నియమితులయ్యారు. స్థానిక సంస్థల నుంచి కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ సర్పంచ్ కృష్ణయ్య, పీలేరు పీఏసీఎస్ అధ్యక్షుడు, పీలేరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారిని కూడా సభ్యులుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. నూతనంగా నియమితులైన ఏఎంసీ పాలకవర్గం ఏడాది కాలపరిమితితో ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా చంద్రమౌళి



కోసూరి చంద్రమౌళి, నౌషాద్‌అలి

వాల్మీకిపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం నియమితులయ్యారు. కమిటీ ఛైర్మన్‌గా వాల్మీకిపురానికి చెందిన కోసూరి చంద్రమౌళి, వైస్ ఛైర్మన్‌గా గుర్రంకొండకు చెందిన షేక్.నైషాద్ అలీ నియమితులయ్యారు. అలాగే సభ్యులుగా బి.జయవర్ధిని, బి.అనసూయ, ఎన్.బయ్యారెడ్డి, డి.ప్రభాకర్, తాహీర్‌అలీ, డి.విజయలక్ష్మి, ఎస్.బాబా జాన్, బి.రాధ, పి.శ్రీనివాసులు, బి.సాలమ్మ, ఎం.భారతి, పి.కాంత రాజు, టి.ముబీన, తదితర సభ్యులు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఉరి వేసుకుని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మదనపల్లెఅర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె, మార్కెట్ యార్డులోని టమోటా వ్యాపారి గదిలో సోమవారం గుర్తు తెలియని వక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. సురేంద్ర అలియాస్ దండుగాడు అని పిలువబడే ఈయన టమోటా మండీల్లో కూలి పనులు చేసుకొంటూ ఉండేవాడని స్థానికుల ద్వారా తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.



అరచేతిలో అన్నీ సేవలు

- అందుబాటులోకి వాట్సాప్ గవర్నెన్స్ యాప్
- ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందే అవకాశం
- అవగాహన లేక ఆదరణ కరువు
- విస్తృత ప్రచారం ద్వారానే మంచి ఫలితాలు
- వాట్సాప్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

బద్వేలుటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం దూసుకు పోతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గతంలో ఇ-గవర్నెన్స్ పేరుతో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువచేసిన ప్రభుత్వం ఇప్పుడు వాట్సాప్ గవర్నెన్స్‌కు తెరతీసింది. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ఆవిష్కృతమైన వాట్సాప్ గవర్నెన్స్ ఇప్పటి వరకు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఉన్న కాస్త దూరాన్ని కూడా చెరిపేసింది. మనమిత్ర - ప్రజల చేతులో ప్రభుత్వం పేరుతో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించి ప్రజలకు అనేక రకాల సేవలను అందించనున్నారు. గతంలో సచివాలయాలకు వెళ్లి ప్రజలు అష్టకష్టాలు పడేవారు. ఇప్పుడు మొబైల్ ఉంటే అరచేతి లోనే అన్ని ప్రభుత్వ సేవలను పొందడంతో పాటు సమస్యలపై ఫిర్యాదు చేసే అవకాశాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. మొబైల్స్ వినియోగిస్తున్న వారిలో నూటికి 90శాతం మంది వాట్సాప్‌ను వాడుతున్నారు. ఈ యాప్ ద్వారానే ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువకానున్నాయి.

మనమిత్ర నెంబర్ 9552300009 నెంబర్‌ను మొబైల్‌లో నమోదు చేసుకోవాలి. ఆ నెంబర్‌లో ఉన్న వాట్సాప్‌ను తెరచి హాయ్ అనే ఆంగ్ల పదాలను టైప్‌చేసి పంపిస్తే చాలు 161 పౌరసేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వశాఖలకు సంబంధించిన పనులను, సమస్య లను ప్రజలు తమ ఫోన్ నుంచి నేరుగా పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్‌ను ప్రవేశపెట్టింది. అయితే ప్రజల్లో సరైన అవగాహనలేక ఈ యాప్‌ను ఎలా వినియోగించాలో తెలియక సతమతమవుతున్నారు.

యాప్‌పై అవగాహన పెంచాలి

ఈ యాప్‌పై చాలా మందికి అవగాహన లేదు. అధికారులు దృష్టి సారించకపోవడంతో ఈ యాప్ ఇంకా ప్రజాదరణకు నోచుకోలేదు. కొంత మంది ఈ యాప్‌ను వాడుకుందామని చూసినా సర్వర్ లోపా లు, తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ చాలా మంది తమ అవసరాల కోసం కార్యాలయాలకు పరుగులు పెడుతు న్నారు. ఈ యాప్ ప్రజల్లోకి వెళ్లాలంటే దీనిపై ప్రచారాన్ని విస్తృతం చేయాలి. ఈయాప్‌ల పనితీరు, వాడే విధానంపై అధికారులకు అవగాహన కల్పించాలి.

యాప్‌లో వివరాలిలా..

ఎడ్యుకేషన్ : ఈ యాప్‌కు సంబంధించి విద్యార్థులకు అవసరమైన హాల్‌టికెట్స్‌ను నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతేగాకుండా విద్యా శాఖకు సంబంధించి మరింత సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు.

టెంపుల్ సర్వీసెస్ : మనకు కావాల్సిన దేవాలయాల దర్శనం, రూమ్ టికెట్స్ ఈ యాప్ ద్వారా పొందవచ్చు. ఆలయాల్లో సేవ చేసుకునే ఉద్దేశ్యం ఉన్నవారు కూడా ఈయాప్ ద్వారా ఆ అవకాశాన్ని తెలుసుకోవచ్చు.

గ్రీవెన్స్ సర్వీసెస్ : ఈ యాప్ ద్వారా మనం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే అది ఎంత వరకు వచ్చిందనే దానిపై ప్రోగ్రెస్ రిపోర్ట్ తెలుసుకోవచ్చు.

ఆర్టీసీ సర్వీసెస్ : ఆర్టీసీ బస్సులలో ఎక్కడికైనా ప్రయాణం చేయాలంటే టికెట్స్ బుక్ చేసుకునేందుకు వీలు ఉంటుంది.

హెల్త్‌కార్డు సర్వీసెస్ : ఈ యాప్‌లో ఎన్టీఆర్ వైద్యసేవను పొందవచ్చు. నూతన హెల్త్‌కార్డులను తీసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

రెవెన్యూ సేవలు : ఆదాయ, కులం తదితర ధ్రువపత్రాలను పొందవచ్చు. రెవెన్యూ శాఖలో ఇతర సేవలను కూడా ఈ యాప్‌ను వినియోగించుకొని పొందవచ్చు.

పోలీస్ సర్వీసెస్ : ఏవైనా ముఖ్య డాక్యుమెంట్లు, ఇతర వస్తు వులు కానీ పోగొట్టుకుంటే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసు కోవచ్చు. పోలీసుశాఖ నుంచి ఇతర సేవలను కూడా ఈ యాప్ ద్వారా పొందవచ్చు.

మున్సిపల్ సర్వీసెస్ : నగర పట్టణ పరిధిలోని ప్రజలు కొత్త కొళాయి కనెక్షన్, ట్రేడ్ లైసెన్స్‌లు పొందవచ్చు. అలాగే ఆస్తిపన్ను, నీటి పన్ను, ఖాళీస్థలం పన్నులు చెల్లించవచ్చు.



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : డీఆర్వో



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చూపకుండా తక్షణం పరిష్కరించాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు అన్నారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో డీఆర్వో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబం ధిత అధికారులు, క్షేత్రస్థాయిలో స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు, పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోగా తప్పకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అందిన విజ్ఞప్తుల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

- కడప నగరం రామచంద్రాపురానికి చెందిన షేక్ హుసేన్ పీరాన్ తనకు 60 ఏళ్లు వచ్చాయని, వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరారు.
- చెన్నూరు మండలానికి చెందిన మహమ్మద్ సలీం తన భూమికి హద్దులు చూపి ఆక్రమణ నుంచి కాపాడాలని విన్నవించారు.
- వల్లూరు మండలం అంబవరం గ్రామానికి చెందిన పి.ఆది నారాయణరెడ్డి తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అభ్యర్థించారు.
- కడప చెమ్ముమియ్యాపేటకు చెందిన గోవిందయ్య తనకు టీటీసీ శిక్షణకు అర్హత ఉన్నా తరగతులకు హాజరు కావడానికి అనుమతి ఇవ్వడం లేదని.. టీటీసీ ట్రైనింగ్ సెంటరు వారిని విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, సర్వే ల్యాండ్ అధికారి మురళీక్రిష్ణ, ఎస్డీసీలు శ్రీనివా సులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలేపల్లె గ్రామ సమీపంలో ఈనెల 13న ఐదుగురు చిన్నారులు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బాధిత చిన్నారుల కుటుంబం సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. అనంతరం తన సొంత నిధుల నుంచి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున రూ.5లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధైర్యపడవద్దు, టీడీపీ అండగా ఉంటుందని చిన్నా రుల తల్లి దండ్రులకు భరోసా ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నాయకులు కాణాల మల్లికార్జునరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి, మిల్లు శ్రీను, సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయం కడపకు వరం : మంత్రి సవిత



భూమి పూజా కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు మాధవి, చైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన దాయకమైన గొప్ప పుస్తక సంపదను కలిగిన బ్రౌన్ గ్రంథాలయం కడపకు వర మని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంజీవరెడ్డిగారి సవిత అన్నారు. సోమవారం ఉదయం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామా రావుదే అన్నారు. 1995లో ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబునా యుడు బ్రౌన్ గ్రంథాలయాన్ని అధికారికంగా ప్రారంభించారని, ఇపుడు నిర్మించబోయే నూతన భవనాన్ని కూడా ఆయన చేతనే ప్రారంభింపజేస్తామన్నారు. వైవీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస రావు మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని కీర్తింపబడిందని, తెలుగు భాషా సాహిత్యాలకు ప్రధాన కేంద్రంగా బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ సహాయ సహకారాలు మరింత అందేలా చూస్తామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కడప అంటే ఇతర ప్రాంత ప్రజలకు చిన్నచూపు ఉందని, కానీ బ్రౌన్ గ్రంథాలయం లాంటి విజ్ఞాన సౌధం ఆ అపనిందను రూపు మాపేలా వెలిసిందన్నారు. గ్రంథాలయంలో ఉన్న తాళపత్ర గ్రంథాలను, ఇతర రాతప్రతులను ప్రత్యేకంగా చూపిస్తూ డాక్యుమెంటరీ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో తెలుగుభాషతో పాటు ఇతర భాషలకు చెందిన గ్రంథాలు అందుబాటులోకి తేవడం వల్ల మరింత విస్తృతికి తోడ్పడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లా డుతూ గ్రంథాలయ నూతన భవన నిర్మాణా నికి ప్రభుత్వ సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలకు బ్రౌన్ గ్రంథాలయం మూల కేం ద్రంగా ఉందని, జిల్లా ప్రజలందరు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంసల హామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడారు. రిజిస్ట్రార్ పుత్తా పద్మ ఆహ్వానం పలుకగా సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి వందన సమర్పణ చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, కడప ఆర్డీఓ ఇర్విన్, నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి, మెప్మా పీడీ కృష్ణకుమార్, వైవీయూ పాలక మండలి సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన రాణా

కొండాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు తాళ్ల ప్రొద్దుటూరు వైసీపీ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తున్న ముగ్గురిని నెల్లూరుకు వెళుతున్న కారు ఢీకొంది. ఈసంఘటనలో ప్రొద్దుటూరుకు చెందిన రాణా (65) అనే వ్యక్తి మృతి చెందగా, డొమ్మరనంద్యాలకు బాబు, ఓబులేసు గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో తాడిపత్రికి తర లించారు. వీరంతా పుట్టువెంట్రుకల కోసం తాళ్లప్రొద్దుటూరుకు వచ్చి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు గుంతలో పడి వ్యక్తి మృతి



అబల్‌మాజీ మృతదేహం

బ్రహ్మంగారిమఠం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పనుల్లో భాగంగా పని చేస్తుండగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అబల్‌మాజీ (45) అనే వ్యక్తి సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు గుంతలో పైనుంచి జారి కింద పడటంతో మృతి చెందాడు. మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

కేజీపీజీసెట్ ఫలితాలు విడుదల



కేజీపీజీ సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న కందుల విద్యాసంస్థల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని), కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ తదితరులు

సీకేదిన్నె, మే 19 (ఆంధ్రజ్యోతి): కేజీపీజీసెట్ 2కే25 ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు కందుల విద్యాసంస్థల కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరమ్మలు తెలిపారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వారు సంయుక్తంగా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 నుంచి ఈ పరీక్షలునిర్వహించడం జరుగుతోందని.. ప్రతిసంవత్సరం లాగే ఈ ఏడాది కూడా విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. 200 మంది పరీక్ష రాయగా 104 మంది అర్హత సాధించారని, మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ఉచిత విద్యను కల్పిస్తామని తెలిపారు.

ఏఐసీటీఈ అనుమతి : 2025-26 విద్యాసంవత్సరానికి ఎంబీఏ పీజీ కోర్సు ప్రారంభించేందుకు ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి 120 సీట్లకు అనుమతి లభించినట్లు వారు తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మేనేజ్‌మెంట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో అనుమతి పొందామన్నారు. కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరప్రసాద్, కేఎల్ఎంప్రిన్సిపాల్ ఎంవీ రత్నమ్మ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి రాయపాటి నాగరాజు పాల్గొన్నారు.

పేద పిల్లల అవసరాల గుర్తింపునకు సతి కమిటీ

- అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా



కడప రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల పిల్లల అభ్యున్నతి కోసం డిస్ట్రిక్ట్ సతి కమిటీని ఏర్పాటు చేసినట్లు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ సి.ఆసిఫా సుల్తానా పేర్కొన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్‌లో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ డిస్ట్రిక్ సతి కమిటీ పేద పిల్లల అవసరాలను గుర్తించి వారికి తగు న్యాయ సహాయం అందజేస్తుందన్నారు. ఈ కమిటీ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అధికారుల సహకారంతో సర్వే చేయడంతో పాటు ఆధార్ రిజిస్ట్రేషన్ క్యాంప్స్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాలు మే నుంచి ఆగష్టు 15 వరకు కొనసాగుతాయన్నారు. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా పానల్ న్యాయవాదులతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, విద్య, వైద్య, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్, ఆర్గనైజర్స్ తదితర శాఖల అధికారులు పాల్గొని పేద విద్యార్థుల డేటాను సేకరించి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ చొరవ తీసుకుంటుందన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ హెగ్డే, జిల్లా రెవెన్యూ ఆఫీసర్ ఎంవీ నాయుడు, రాయచోటి రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారికి వసంతోత్సవం, చక్రస్నానం



శ్రీవారికి చక్రస్నానం చేస్తున్న పూజారులు

జమ్మలమడుగు, మే 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారికి వసంతోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజకు హాజరైన భక్తులు వసంతోత్సవం ఆడారు. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో శ్రీవారి ఊరేగింపు రద్దు చేసి ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి.. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆలయ పూజారులు చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణం, మహాపూర్ణాహుతి, మహాకుంభప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ హైస్కూలుమైదానంలో రెండో రోజు సోమవారం ఉదయం సీనియర్ విభాగం బండలాగుడు పోటీలు పోటాపోటీగా కొనసాగాయి. ఈ సందర్భంగా కొందరు పందేలు కాశారు. కాగా, మొదటిరోజు న్యూకేటగిరి, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఇందులో బోరెడ్డి కేశవరెడ్డి (పెద్దకొట్టాల), సుంకిసురేంద్ర రెడ్డి (తెలంగాణాకు చెందిన హుజూర్‌నగర్) ఎడ్ల విజేతగా నిలిచి మొదటి బహుమతి గెలుచుకున్నాయి. వీరికి జమ్మలమడుగు పట్టణానికి చెందిన శివకుమార్‌రెడ్డి, కూటమి నాయకులు దేవగుడి శివ నారాయణరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వర రెడ్డి రూ.1.50 లక్షలు అందజేశారు. రెండోస్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులుకు ద్వితీయ బహుమతి కింద రూ.1.20 లక్షలు దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ వారు అందజేశారు. మూడో బహుమతి రామసుబ్బారెడ్డి (హుసేలాపురం, నంద్యాల జిల్లా)కి రూ.90 వేలు మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి అందజేశారు. 4వ బహుమతి రమేష్ బాబు (తాడిపత్రి), ద్వార్శల గురివిరెడ్డి (ప్రొద్దుటూరు)కి రూ.70 వేలను పెద్దదండ్లూరు సర్పంచ్ గువ్వల రామాంజనేయరెడ్డి అందజేశారు. 5వ బహుమతిగా కుందూరు రాంభూపాల్‌రెడ్డి, మాధవరెడ్డి (చిన్నకొమెర్ల, మైలవరం మండలం)లకు రూ.50 వేలను నగళ్లపాటి రవీంద్రకుమార్ అందజేశారు. అలాగే 6 నుంచి 9వ స్థానం వరకు నిలిచిన ఎడ్ల యజ మానులకు బహుమతులు అందజేశారు. పోటీలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో పోటీలు విజయవంతం జరిగాయి.





బండలాగుడు పోటీలు, మొదటి బహుమతి విజేతకు రూ.1.50 లక్షలు అందజేస్తున్న శివనారాయణరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి

జగనన్న ఇళ్ల పేరుతో సామాన్యుడిపై ఆర్థిక భారం




ఇంటిని గోడ వరకు నిర్మించి వదిలేసిన దృశ్యం

● జగనన్న కాలనీల్లో పునాదులు, అసంపూర్తి భవనాలు

సంబేపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): 'పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం. ఊర్లకు ఊర్లు కట్టిస్తాం' అంటూ గత వైసీపీ ప్రభుత్వం పేదవాళ్లను నమ్మించి నట్టేట ముంచింది. వారిచ్చిన ఒకటిన్నర సెంటు స్థలంలో పెట్టుబడులు పెట్టి పనులు చేయలేక అప్పులు చేసి నష్టపోయారు. జగనన్న కాలనీ లేఅవుట్లు ఎక్కడ చూసినా నివాసానికి యోగ్యం కాని ఊరికి దూరంగా గుట్టలు, బండలపై ఏర్పాటు చేశారు. ప్రభుత్వమే గృహాలు కట్టిస్తామని ఊర్లకు ఊర్లు నిర్మిస్తామని గొప్పలు చెప్పి తీరా సామాన్యుడిపై నెట్టేశారు. దీంతో అప్పటిలో ఇసుక, సిమెంటు, కడ్డీలు గృహ అవసరాలకు ఉపయోగపడే సామగ్రి ధరలు అధికంగా ఉండడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోక కొంత మంది అప్పులు చేసి గృహాలు కట్టారు. కొంత మంది పునాది దశలోనే వదిలేశారు. మరికొంత మంది గోడలు పూర్తి చేసి, ఇంకొంది మంది మోల్డింగ్ వేసి వదిలేశారు. నేటికీ 60 శాతానికిపైనే కాలనీల్లో అసంపూర్తి నిర్మాణాలు కనిపిస్తున్నాయి. సంబేపల్లె మండలంలో 17 లేఅవుట్లు వేసి 1484 గృహాలు మంజూరు చేశారు. జగనన్న కాలనీల పేరుతో ఇంటి నిర్మాణాల కోసం ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంటు స్థలాన్ని కేటాయిస్తూ లేఅవుట్‌లు ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణం నమూనాతో పట్టాలు ఇచ్చారు. కాలనీలో గృహాలు ఒకే కొలతల్లో ఆదర్శంగా ఉండాలి. అయితే కొన్ని చోట్ల పలుకుబడి ఉన్న వాళ్లు ఒక్కొక్కరు రెండు, మూడు స్థలాలను ఆక్రమించుకొని పెద్ద పెద్ద గృహాలు కట్టడం ఇందుకు నిదర్శనం. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి. సంబేపల్లె మండలంలో ఉన్న జగనన్న కాలనీలే ఇందుకు నిదర్శనం.

కూటమి ప్రభుత్వంలో పెండింగ్ గృహాల పూర్తికి సహకారం

గత వైసీపీ ప్రభుత్వంలో గృహాలు మంజూరై ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేక వివిధ దశలో ఆగిపోయిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.



మోటకట్ల లేఅవుట్‌లో పునాదులు కట్టి వదిలేసిన లబ్ధిదారులు



నామాల గుట్టపై కట్టిన ఇళ్లు

2024 డిసెంబరు 31వ తేదీ నాటికి ఇళ్లు పూర్తి చేయాలని, 'మన ఇళ్లు-మన గౌరవం' పేరుతో లబ్ధిదారులకు రుణాలను అందించేలా డ్వాక్రా తరపున ప్రోత్సాహం అందించింది. సంబేపల్లె మండలంలో ప్రతి గ్రామ పంచాయతీలో లేఅవుట్ వేశారు. మోటకట్ల పంచాయతీలో సంబేపల్లె మండల కేంద్రాన్ని ఆనుకొని వడ్లపల్లి రోడ్డు మార్గంలో ఉండడంతో ఇక్కడ 183 గృహాలకు లేఅవుట్‌లు వేశారు. ఇందులో 120 మందికి గృహాలు మంజూరు పత్రాలను అందించారు. ఇన్ ఎలిజిబుల్ అభ్యర్థులకు మాత్రం పెండింగ్‌లో పెట్టారు. అయితే ఇక్కడ కాలనీలో అనర్హులు పునాదులు వేసి వదిలేశారు. గృహాల పేరుతో వ్యాపారం చేసేందుకు కొంత మంది ఈ మార్గాన్ని ఎంచుకోవడంతో ఇప్పటికీ ఇక్కడ పునాదులే కనిపిస్తున్నాయి. సంబేపల్లె పంచాయతీ నామాల గుట్టలో 40 గృహాలు మంజూరు చేశారు. ఇండ్లు పరిశీలిస్తే గుట్టపైన కట్టారు. ఇక్కడ నివాసానికి యోగ్యంగా లేవు. దుద్యాల, దేవపట్ల, నారాయణరెడ్డి పల్లె, ఇలా చాలా గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి. గుట్టలు, బండలే పేదవాడు గృహ నిర్మాణం పేరుతో నిలువునా మోసపోయారు.

కూటమి ప్రభుత్వంలో భవనాలకు ఆర్థిక భరోసా



వైసీపీ ప్రభుత్వంలో పూర్తికాని ఇళ్ల కోసం కూటమి ప్రభుత్వం 'మన ఇళ్లు మన గౌరవం' పేరుతో ఆర్థిక భరోసా కల్పిస్తోంది. బీసీ, ఎస్సీ, మైనార్టీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు 75 వేల చొప్పున ఆర్థిక భరోసాను కల్పించింది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్థిక సహకారం అందించడం అభినందనీయం.

- కూనాసి సుబ్బరాజుయాదవ్, టీడీపీ రాజంపేట పార్లమెంట్ ప్రచార కార్యదర్శి

ప్రమాద బాధితురాలికి పరామర్శ

ఓబులవారిపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునఃప్రారంభ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురైన కడియాలపల్లెకు చెందిన యానిమేటర్ గీతను ఎంపీడీవో మల్‌రెడ్డి, ఏపీఎం మల్లికార్జునరాజు సోమవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు దామోదర్, హరిబాబు, యానిమేటర్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలపై అవగాహన ఉండాలి

ఓబులవారిపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో బ్యాంకుల ద్వారా అందించే వివిధ పథకాల పట్ల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు అవగాహన కలిగి ఉండాలని విడ్స్ సంస్థ కౌన్సిలర్లు ప్రతాప్, శ్రీహరి, సుబ్బరాయుడు కోరారు. రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో ఓబులవారిపల్లె కేంద్రంగా రైల్వేకోడూరు, చిట్వేలి మండలాల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, వంటి పథకాలను వినియోగించుకోవాలన్నారు.

ఫిజియోథెరపీతో కీళ్ల సమస్యల నివారణ



ఫిజియోథెరపీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

రైల్వేకోడూరు, మే 19(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా ఫిజియోథెరిపి ద్వారా వ్యాయా మం చేస్తే కీళ్ల సమస్యలు తొలగిపోతాయని నిమ్స్ (నిజాం ఇనిస్టిటూట్ ఆఫ్ హైదరాబాద్) వైద్యుడు మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మండల పరిషత్ సభాభవనంలో సచివాలయ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీళ్ల తదితర సమస్యలకు తప్పకుండా ఫిజియో థెరిపి చేయించుకోవాలన్నారు. నొప్పులకు ఎక్కువగా పెయిన్‌కిల్లర్స్‌ను వాడుతున్నారని, అవి శరీరంపై ఎక్కువ ప్రభావం చూపుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం ఇళ్లలోనే వ్యాయామం చేసుకుంటే మంచిదన్నారు. ఎంపీడీవో నాగర్జునరావు మాట్లాడుతూ ఎటు వంటి డాక్టర్ అయినా ఫిజియోథెరిపి వైద్యులను కలవమని చెబుతారన్నారు.

వైభవంగా కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

సిద్దవటం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 గ్రామం ఎస్‌కేఆర్‌నగర్‌లో వెలసిన భద్రావతి భావనారాయణస్వామి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవారి విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు.

హెల్మెట్ ధరిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం : సీఐ

సిద్దవటం, మే 19 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ దరిద్దాం.. ప్రాణాలు కాపాడుదాం అని సీఐ ఒంటిమిట్ట సీఐ బాబు అన్నారు. మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారి భాకరాపేట ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ఆయన సూచించారు.

'రోడ్డు అమ్మేస్తున్నారు... కాపాడండి'



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మదనపల్లి వాసులు

రాయచోటి (కలెక్టరేట్), మే 19 (ఆంధ్రజ్యోతి): 'రోడ్డు అమ్మేస్తున్నారు... కాపాడండి'అని పీజీఆర్‌ఎస్‌లో మదనపల్లివాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లి మండలం నక్కలదిన్నె తండాలో ఓ వ్యక్తి 2018లో దాదాపు 42 ప్లాట్లు వేయగా అందులో ఇదే ప్రాంతానికి చెందిన వారు 22 ప్లాట్లు కొనుగోలు చేశారన్నారు. అవి పూర్తిగా రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నామని వారు తెలిపారు. సర్వే నెంబర్ 8/1లో 22 ప్లాట్లకు గాను ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని, ప్లాట్లకు వెళ్లేదారిని కూడా అమ్మేసుకుని అక్కడికి రానివ్వడం లేదన్నారు. విజయకుమార్‌నాయక్, శ్రీరాములు, బాబునాయక్, వేణురెడ్డి, నరేశ్‌నాయక్, గిరిబాబు, ప్రభాకర్‌నాయక్, చుక్కల తండా పెద్ద నరసింహులునాయక్, షరీఫ్ పాల్గొన్నారు.

శివయ్య కోనలో భక్తుల తాకిడి



పంచలింగాల గుడి వద్ద భక్తులు

సిద్దవటం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్యపూజేశ్వరకోనలో సోమవారం వేంపల్లె, ప్రొద్దుటూరు, చిట్వేలి, నందలూరు, కమలాపురం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో శివపార్వతుల దర్శనానికి భక్తులు రావడంతో నిత్యపూజ కోనలో కాలినడకన వెళ్లే రహదారి రద్దీగా మారింది. ఈ సందర్భంగా శివ భక్తులు మాట్లాడుతూ శివునికోనలో పంచలింగాల గుడి వద్ద నుంచి కాలినడకన సన్నిధానానికి వెళ్లే రహధారి అభివృద్ధి చేపట్టాలని, రహదారిలో పెద్ద పెద్ద గుండ్లు ఉండడంతో వృద్ధులకు, పిల్లలకు ఇబ్బంది ఏర్పడుతుందని ఎండోమెంట్ అధికారులు స్పందించి కాలినడకన వెళ్లే రహదారిని అభివృద్ధి చేపట్టాలని శివభక్తులు తెలిపారు. ఈ విషయమై నిత్యపూజకోన ఇన్‌చార్జి ఈవో శ్రీధర్‌ను వివరణ కోరగా నిత్యపూజకోనకు వెళ్లే రహదారి ఆశ్రమం వద్ద నుంచి పంచలింగాల గుడి వరకు రహదారి ఏర్పాట్లు కొరకు రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులతో సంప్రదింపులు జరిపి స్థలం నిర్ధారించి రోడ్డు ప్రతిపాదన కొరకు నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, పంచలింగాల గుడి వద్ద నుంచి భక్తులు వెళ్లే రహదారి రోడ్డుకిరువైపుల ఉన్న పిచ్చిమొక్కలు, రహదారికి అడ్డంగా ఉన్న పెద్ద పెద్ద గుండ్లు తొలగించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన నరసింహారెడ్డి



వీరబల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి ఎస్ఐగా జే.నరసింహారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య సైబర్ క్రైమ్ సెల్ నుంచి బదిలీపై వీరబల్లికి వచ్చారు. ఈయన గతంలో సుండుపల్లె, రాయచోటి ఎస్ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వీరబల్లి మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణ కోసం పనిచేస్తానని, అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

కొద్దిపాటి వర్షానికే రహదారి జలమయం



ఎస్.రాజంపేటలో రోడ్డుపై వర్షం నీరు

సిద్దవటం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడప-పోరుమామిళ్ల రహదారి ఎస్.రాజంపేట గ్రామం ఎస్సీ కాలనీ సమీపంలో ఆర్‌అండ్‌బి రోడ్డు కుంటను తలపిస్తోంది. దీంతో వంతాటిపల్లె, జ్యోతి, గొల్లపల్లె వెంకటాయపల్లె, పి.కొత్తపల్లెవాసులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి వర్షపునీరు నిలవకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు. ఆర్‌అండ్‌బి ఏఈ గంగిరెడ్డిని వివరణ కోరగా మరమ్మతులకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

పాలకొండ్రాయుడు సేవలు అజరామరం

● మాజీ మంత్రి సి.రామచంద్రయ్య



పాలకొండ్రాయుడుకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రామచంద్రయ్య

రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు సేవలు అజరామరమని మాజీ మంత్రి సి.రామచంద్రయ్య తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల ప్రీతం రెసిడెన్సి వద్ద పాలకొండ్రాయుడు దశదిన కర్మను ఆయన కుమారులు సుగవాసి బాలసుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్‌బాబులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాయచోటి నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల మండలాలు, జిల్లాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాలకొండ్రాయుడుకు నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ మంత్రి సి.రామచంద్రయ్య పాలకొండ్రాయుడుకు నివాళులర్పించి ఆయన కుమారులను పరామర్శించారు. పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు నిశ్చల్ నాగిరెడ్డి, మార్కెట్ కమటీ మాజీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా మైనార్టీ కార్యదర్శి ఇర్షాద్‌అలీఖాన్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాధరెడ్డి తదితర మండల టీడీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదతరులు పెద్దాయన చిత్రపటానికి నివాళులు అర్పించి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పీడిత వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య



నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నేతలు

రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి):పీడత వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు కొనియాడారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యుడు మహేశ్వర్‌రాజు, కిరణ్‌కుమార్, సీపీఎ నాయకులు నాగబసిరెడ్డి, రామచంద్ర, సీఐటీయూ నాయకులు ఏవీ రమణ, సుబ్రమణ్యంరాజు, బీవీ రమణ, లోహిత్, గీత, రమేశ్, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సేవలు మరువలేనివి

రాజంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లె సుందరయ్య సేవలు మరువలేనివని సీపీఎం అన్నమయ్య జిల్లా కమిటీ సభ్యుడు చిట్వేలి రవికుమార్ తెలిపారు. సోమవారం పుచ్చలపల్లి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పుచ్చలపల్లి లేకపోవడం కమ్యూనిస్టుపార్టీలకు, కార్మిక వర్గానికి, పేదలకు తీరని లోటు అన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

రైల్వేకోడూరు, మే 19(ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత, దివంగత పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు సీహెచ్ చంద్రశేఖర్, నాయకులు లింగాల గారి యానాదయ్య, సీఐటీయూ మండల పార్టీ కార్యదర్శి జాన్ ప్రసాద్ తెలిపారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళర్పించారు. ఏపీఎండీసీ జేఏసీ పోరాట కన్వీనర్ ఆర్. వెంకటేష్, బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ బండారు రాజశేఖర్, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

పెనగలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణనెల్లూరులో వేములమ్మతల్లి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కల్లుగీత కులస్థుల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి కోనంకి రమేష్ అధ్యక్షత వహించారు. గ్రామంలోని కల్లు గీత కులస్థులే కాకుండా పరిసర గ్రామాల్లోని పలువురు కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరంగా యాత్ర అనుమతికి ఏఎస్పీకి వినతి

రాజంపేట టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలో మంగళవారం నిర్వహించే తిరంగా యాత్రకు అనుమతిని ఇవ్వాలని కోరుతూ సోమవారం ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేకు బీజేపీ నాయకులు పట్టుపోగుల ఆదినారాయణ, మైనార్టీ నాయకులు అబూబకర్‌లు వినతి పత్రాన్ని అందజేశారు.

జీవో 4ను రద్దు చేయాలి : వీఆర్వోలు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

రాజంపేట టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా జీవో 4ను విడుదల చేసిందన్నారు. దీనివల్ల వీఆర్వోలకు పని భారం పెరుగుతుందని తెలిపారు. సోమవారం వీఆర్వో సంఘం నేతలు తహశిల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశిల్దారు లవణకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జీవో కారణంగా రాష్ట్రంలో సచివాలయాలు కుదించబడతాయని దీనివల్ల వీఆర్వోలకు పనిభారం పెరుగుతుందన్నారు. కావున జీవోను వెంటనే రద్దు చేయాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తామన్నారు.

దేశ సేవ కోసం ఏర్పడిన పార్టీ బీజేపీ



మాట్లాడుతున్న కృష్ణయాదవ్

పెనగలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): దేశ సేవ కోసం ఏర్పడిన పార్టీ బీజేపీ అని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిండి బోయిన కృష్ణయాదవ్, రైల్వేకోడూరు అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చెంగల్ రాజు తెలిపారు. సోమవారం పెనగలూరులోని ఓ ప్రైవేటు కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోనేటి రెడ్డికృష్ణరాయల్ అధ్యక్షతన బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ నేత చెంగల్ రాజు మాట్లాడుతూ దేశ ప్రజల అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే పార్టీ బీజేపీ అని కొనియాడారు.

నూతన కమిటీ నియామకం : బీజేపీ మండల అధ్యక్షుడు కోనేటి రెడ్డికృష్ణరాయల్ అధ్యక్షతన బీజేపీ మండల కమిటీ నియామకం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా సోమేసుల చంద్రమోహన్, కోడూరు పెంచలసాయి, కోనేటి శ్రీనివాసులు, చెవ్వు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పొడమేకల మోహన్‌యాదవ్, తిప్పన వెంకటరమణ, కార్యదర్శులుగా చాపల తిరుపాల్, ఆరిఫ్, ఖాజా మొహిద్దీన్, కంబయ్యగారి శివప్రసాద్, కోశాధికారిగా ఇనుకోలు నవీన్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

రాజంపేట టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శేషయ్య అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సభాభవనంలో ప్రజా పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై జేసీకి ఫిర్యాదు

పుల్లంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొమ్మనవారిపల్లె పంచాయతీ వల్లూరుపల్లెలో సర్వేనంబరు 846లో పోలీసు జగదీశ్వర్‌రెడ్డి 5 నుంచి 7 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించారని కొమ్మనపల్లెకు చెందిన సుమలత సోమవారం పీజీఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి చుట్టూ పెన్సింగ్ వేసి మామిడి చెట్లు నాటారని, ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె జాయింట్ కలెక్టర్‌ను కోరారు. స్పందించిన జేసీ వెంటనే పుల్లంపేట తహసీల్దారుకు ఫోన్‌చేసి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు.

పుల్లంపేట మండల బీజేపీ కార్యవర్గం ఏర్పాటు

పుల్లంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.పరమేశ్, ఉపాధ్యక్షుడిగా చొప్పా రాజారెడ్డి, విష్ణువర్దన్, భరత్‌వర్మ, బుజ్జమ్మ, కార్యదర్శులుగా రెడ్డయ్య, మల్లికార్జున, బాలాజీ, రమణ, కోశాధికారిగా గుజ్జల బాలాజీని ఎన్నుకున్నారు. అసెంబ్లీ కన్వీనర్ గడ్డం శంకర్‌రాజు, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాసులు, మాజీ మండలాధ్యక్షులు సుబ్బయ్య, శంకర్‌రాజు, సీనియర్ నాయకులు పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోజన ఏర్పాట్ల పరిశీలన

రామాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరిగే మహానాడుకు వెళ్లే టీడీపీ నాయకులు, కార్యకర్తలకు రామాపురం మండలం గువ్వలచెరువు వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేయనున్న భోజన వసతి కోసం ఏర్పాట్లను సోమవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు నిశ్చల్‌నాగిరెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి వచ్చే కార్యకర్తలకు సుమారు లక్ష మందికి భోజనాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యకర్తలకు వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు. టీడీపీ నాయకులు చంద్రమౌళి, విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, వినోద్‌రెడ్డి, రామచంద్ర, ఆజమ్, హరిప్రసాద్, లోకేశ్, నాగరాజు, ధనుంజయ, సురేంద్రనాథ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

ఒంటిమిట్ట, మే 19 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీనియర్ నాయకుడు, మండల మాజీ అధ్యక్షుడు పామూరు సుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప నగరంలో మహానాడును నిర్వహించడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. మహానాడుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

స్కూటరు ఢీకొని మహిళ మృతి

మదనపల్లె అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): స్కూటరు ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, పాతబోలు హరిజనవాడకు చెందిన రమణమ్మ(55) కూలి పనులకు వెళ్లి ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వెళుతున్న ఆమెను పోతబోలు సమీపంలో స్కూటర్ ఢీకొని తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త గతంలో చనిపోవడం, ఒక్క కుమారుడు మాత్రమే ఉండడంతో మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. అనంతరం దహనక్రియలు చేసేందుకు ప్రయత్నించారు. ఈ సమాచారాన్ని స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం మహిళ మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

పాముకాటుతో వ్యక్తి...


మృతిచెందిన వెంకట్రమణ

లక్కిరెడ్డిపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిరేవుల పంచాయతీలోని రెడ్డివారిపల్లెకు చెందిన వీరబల్లి వెంకట్రమణ (44) సోమవారం పాముకాటుకు గురై మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వారి వివరాల మేరకు.. మృతుడు వెంకట్రమణ రోజు కూలి పనికి వెళ్లి జీవనం సాగించేవాడని, ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా కట్లపాము వచ్చి కాటు వేసిందని, దీంతో హుటాహుటిన స్థానికులు వెంకట్రమణను రాయచోటి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, భార్య జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లిందని తెలిపారు. కుటుంబ సభ్యులు, పిల్లలు శోక సంద్రంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి...


మహమ్మద్ (ఫైల్‌ఫోటో)

సుండుపల్లె, మే 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రాయవరానికి చెందిన సర్పంచ్ షరీఫ్ తమ్ముడు షేక్.మహమ్మద్ (27) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు... రాజంపేట నుంచి ద్విచక్రవాహనంలో షేక్.మహమ్మద్, మరో యువకుడు రాయవరానికి వస్తుండగా.. సుండుపల్లె వైపు నుంచి సానిపాయి వెళ్తున్న టెంపో వాహనం మడితాడు గ్రామ పంచాయతీ కృష్ణారెడ్డి చెరువు వద్ద ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతి చెందిన యువకుడు ఎంటెక్ చదువుతున్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మినీ లారీ- కారు ఢీ

● ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో లారీ బోల్తాపడడంతో నేలపాలైన టమోటాలు

కురబలకోట, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మన్నబావి సమీపంలో మినీ లారీ, కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన వారు కారులో కదిరిరోడ్డు వైపున వెళుతున్నారు. కాగా బి.కొత్తకోట మండలం గట్టుకు చెందిన రైతులు తమ పొలంలో కోసిన టమోటాలను బాక్సులో మార్కెట్ తరలించడానికి మినీ లారీలో బయలుదేరారు. కాగా దొమ్మన్నబావి సమీపంలో కారు లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కాగా లారీ బోల్తా పడటంతో టమోటాలు నేలపాలయ్యాయి. ప్రమాదంలో కారు దెబ్బతినడంతో పాటు ప్రయాణిస్తున్న మహిళ గాయపడంతో 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అలాగే లారీలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. కాగా ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు నాటుసారా

తయారీదారుల అరెస్టు

- 310 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం


పట్టుబడ్డ నిందితులతో రాయచోటి ఎక్సైజ్ పోలీసులు

రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంబేపల్లి మండలం శెట్టిపల్లి పెద్దబిడికి అటవీ ప్రాంతంలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు మెరుపు దాడులు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్ ఆదేశాల మేరకు రాయచోటి ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర పర్యవేక్షణలో రాయచోటి ఎక్సైజ్ సీఐ హిమబిందు, ఎస్‌ఐ శశిధర్, సిబ్బంది రామయ్య, మోహన్‌రెడ్డి, రాజశేఖర్, విఘ్నేశ్, హుస్సేన్ తదితరులు శెట్టిపల్లి పెద్దబిడికి అటవీ ప్రాంతంలో దాడులు చేశారు. అక్కడ నాటుసారా తయారు చేస్తున్న పెద్దబిడికి చెందిన బుక్కే భాగ్యమ్మ, బుక్కే గోబీరమ్మ అనే మహిళలను అరెస్టు చేయడంతో పాటు నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 310 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసి నిందితులను కోర్టుల్లో హాజరు పెట్టినట్లు ఎక్సైజ్ సీఐ తెలియజేశారు.

చికిత్స పొందుతూ..

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఇతను వారం రోజుల క్రితం అనారోగ్యంతో ములకల చెరువు నుంచి 108 వాహనంలో వచ్చి మదనపల్లెలో చికిత్స తీసుకుంటూ ఉండేవాడు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, మృతదేహాన్ని మార్చురికీ తరలించామని పోలీసులు తెలిపారు.

ధరలు లేకపోవడంతో తంబళ్లపల్లెలో రోడ్డు పక్కన గుట్టలుగా పోసిన టమోటాలు



నిమ్మనపల్లెలో టమోటాలను కోయకుండా వదిలేసిన దృశ్యం



కుదేలవుతోన్న టమోటా రైతు

● ధర లేక టమోటాలను రోడ్డు పక్కన పడేస్తున్న రైతులు

● కూలీల ఖర్చులూ రాని వైనం

టమోటా ధరలు గణనీయంగా పడిపోవడంతో పంట సాగు చేసిన రైతులు కుదేలవుతున్నారు. కాయలను మార్కెటుకు తీసుకువెళ్తే కూలీల డబ్బులు సైతం రావడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇక చేసేదేమి లేక పండిన టమోటా పంటను కొందరు రైతులు పొలాల్లోనే వదిలేస్తుండగా.. మరికొందరు రైతులు కాయలను రోడ్డు పక్కన పారబోస్తున్నారు. దిగుబడులు బాగున్నా ధరలు పతనం కావడంతో లబోదిబోమంటున్నారు.


ధర లేకపోవడంతో టమోటాలను రోడ్డు పక్కన పడేస్తున్న రైతు

తంబళ్లపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేరుశెనగతో పాటు టమోటాను ఎక్కువగా సాగు చేస్తారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సుమారు 3000 ఎకరాలకు పైగా టమోటా సాగులో ఉందని అధికారుల అంచనా. గత ఏడాది చివరి వరకు టమోటా ధరలు ఆశాజనకంగానే ఉన్నా ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో 30 కేజీల బాక్సు ధర కాయల నాణ్యతను బట్టి రూ.40 నుంచి రూ.50 వరకు ఉందని టమోటా రైతులు చెబుతున్నారు. దున్నకం, నారు, కూలీలు, మందులు, రావాణా అన్నీ కలిపి ఎకరాకు సుమారు రూ.1.2 నుంచి రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం టమోటాకు ధర లేకపోవడంతో కాయలు కోసి మార్కెట్టుకు తీసుకువెళ్తే కూలీల డబ్బులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని పరుసతోపు పంచాయతీ పేండేరివారిపల్లెకు చెందిన రైతు మల్లప్ప రెండు ఎకరాల్లో రూ.2.5 లక్షలు పైగా ఖర్చు చేసి టమోటా పంట సాగు చేశాడు. పంట దిగుబడి బాగా వచ్చింది. రైతు నాలుగు రోజుల కిందట కూలీలతో పంటను కోయగా రెండు ఎకరాల్లో సుమారు 160కి పైగా బాక్సులు కోతకు వచ్చాయి. కాయలను మార్కెట్టుకు తరలించగా 30 కేజీల బాక్సు ధర రూ.40 నుంచి 50 పలికింది. ఈ ధరతో కాయలు కోసిన కూలీలకు పెట్టిన ఖర్చు కూడా రాదని ఆగ్రహించిన రైతు కాయలను తీసుకువచ్చి గ్రామానికి సమీపంలోని రోడ్డు పక్కన కాలువలో పారబోశాడు. కాసుల వర్షం కురిపిస్తుందన్న టమోటా చివరకు కూలీల ఖర్చులు సైతం రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి టమాటాకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


ధరలు తగ్గడంతో క్రేట్లలో నిల్వ వున్న టమోటాలు

అధిక దిగుబడులతో ధరలు పతనం

నిమ్మనపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఈ ఏడాది అధికంగా టమోట పంటలు వేయడంతో ధరలు పతనమయ్యాయి. హార్టికల్చర్ అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 700 హెక్టార్లలో టమోట పంట సాగైనట్లు తెలుస్తోంది. ఒక ఎకరా టమాట పంటను పండించాలంటే దాదాపు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు రైతు ఖర్చు చేయాల్సి వుంటుంది. ప్రస్తుతం కలికిరి టమోట మార్కెట్‌లో 30 కేజీల టమాట ధర కేవలం రూ.50 పలికినట్లు రైతులు తెలిపారు. సరాసరి రెండు రోజుల క్రితం దాదాపు రూ.200 వున్న టమోట ధర నేడు రూ.50కి పడిపోవడంతో రైతులు డీలా పడ్డారు. కొందరు రైతులు ధర పతనం కావడంతో కాయలు కోయకుండా చెట్లలోనే వదిలేస్తున్నారు. దీనికి తోడు సాఫ్ట్‌వేర్, రిటైర్డ్, స్థానికంగా పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు సైతం వందల ఎకరాలను కొనుగోలు లేదా కౌలుకు తీసుకొని టమోట పంటలు పండిస్తుండడంతో సామాన్య రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ సారైనా ధరలు వుంటాయని వడ్డీలకు తెచ్చి ఖర్చు చేశారు. ఇదిలా వుంటే కోసిన కాయలను మార్కెట్‌కు తరలిస్తే కమీషన్, కూలీలు, బాడుగలకు పోయి ఒక్క పైసా కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు. కొందరు రైతులు మాట్లాడుతూ.. ఈ సారి ధర కనీసం రూ.400ల కంటే తక్కువ పోతే ఆత్మహత్య చేసుకొంటామని చెబుతున్నారు. ప్రభుత్వం నికర ధరను ప్రకటించి రైతులను ఆదుకొంటే తప్ప బాగుపడే పరిస్థితి కనిపించడం లేదు.

ధరలు లేకపోతే ఆత్మహత్యే



టమోట ధరలు ఇలాగే కొనసాగితే మాకు ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదు. పంటకు నీరు కడితే ఎక్కడ రంగు మారుతాయో అని నీరు కూడా పెట్టడం లేదు. పైగా వైరస్ వ్యాప్తి ఎక్కువగా వుండడంతో మందులకు అధిక మొత్తం చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం రైతును ఆదుకోవాలి.

-శ్రీనివాసులు, గౌనిగారిపల్లి, నిమ్మనపల్లి

కడప వినియోగదారుల కమిషన్‌లో..

చైర్మన్ సహా సభ్యురాలి తొలగింపు

కలికిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్‌తో పాటు మరో మహిళా సభ్యురాలిని తొలగిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తుది ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు.. కడప జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిగా తప్పా అబ్దుల్‌రసూల్‌ను నియమిస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం 2022 ఫిబ్రవరి 3న ఆదేశాలు జారీ చేసింది. నాలుగేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయనతో పాటు కమిషన్‌లో మహిళా సభ్యురాలుగా అదే కాల పరిమితితో దండు అమృతను కూడా నియమించారు. ఈ రెండు నియామకాలకు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 5న ఇరువురూ బాధ్యతలు కూడా చేపట్టారు. కాగా అధ్య క్షుడు రసూల్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ వి.సుబ్బారెడ్డి, కలికిరి శిరీషాలు రాష్ట్ర హైకో ర్టులో ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేశారు. అధ్యక్షుడి అర్హతలు, నియామకపు ప్రక్రియ, పద్ధతులను ప్రశ్నిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అదే విధంగా దండు అమృత నియామకాన్ని సవాలు చేస్తూ వేదల చంద్రవదన అనే మహిళ కూడా హైకోర్టును ఆశ్రయించారు. ఈ రెండు నియామకాలను వేర్వేరుగా విచారించిన హైకోర్టు చివరకు ఇరువురి నియామకాలు చెల్లవంటూ 2024 నవంబరు 15న తీర్పు వెల్లడించింది. ఈ మేరకు తగిన ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ లోగా హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులను సవాలు చేస్తూ అబ్దుల్ రసూల్, దండు అమృతలు వేర్వేరుగా హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. రెండు నియామకాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు సహేతుకమేనని ఆ తీర్పును సమర్థిస్తూ ఈ ఇరువురి రిట్ అప్పీళ్లపై 2025 ఏప్రిల్ 25 డివిజన్ బెంచ్ తుది తీర్పు వెలువరించింది. దీనికి అనువుగా రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది. డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు వీరి నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను రద్దు చేస్తూ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు అబ్దుల్ రసూల్, మహిళా సభ్యురాలు దండు అమృతలను పదవుల నుంచి వైదొలగాల్సిందిగా ఆదేశిస్తూ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి సౌరబ్ గౌర్ సోమవారం విడివిడిగా ఉత్తర్వులు జారీ చేశారు.

దౌర్జన్యం చేస్తున్న గ్యాంగ్‌పై చర్యలు తీసుకోండి

● ఎస్పీకి మదనపల్లె బాధితుల వేడుకోలు


మీడియా ఎదుట వాపోతున్న మదనపల్లె బాధితులు

రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రూ.మూడున్నర కోట్లకు పైగా పలువురి దగ్గర అప్పులు తీసుకొని అప్పు ఇచ్చిన వారిపైనే దౌర్జన్యానికి పాల్పడుతూ బెదిరింపులకు గురిచేస్తున్న గ్యాంగ్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ మదనపల్లికి చెందిన సుమారు 30 మందికి పైగా బాధితులు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు తమ గోడును విన్నవించారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం బాధితులు మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని మదనపల్లి పట్టణానికి చెందిన రమేశ్ భార్య కందుల సుజాత.. ఆమె కుమారుడు కందుల సునీల్, నరేంద్ర భార్య సుంకర లావణ్య, పద్మప్రియ, గౌరీ, నాగరత్న, నలిని, నాగమణి తదితరులతో కలిసి పట్టణంలో ఉండే ఒంటరి మహిళలను, ఫ్యామిలీలను, వృద్ధులను టార్గెట్ చేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, పిల్లలకు ఫీజు కట్టాలని నమ్మబలికి వారి వద్ద నుంచి అప్పు తీసుకుంటూ ఉండేది. ఇలా 30 మందికి పైగా మూడున్నర కోట్ల వరకు సుజాత అప్పు తీసుకుందన్నారు. అప్పు ఇచ్చిన వారు డబ్బులు అడిగితే పైన కనబరిచిన గ్యాంగ్‌తో వారి ఇంటి వద్దకు వెళ్లి వారిని నానా రకాలుగా దూషించడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసి అవమానకరంగా మాట్లాడుతోందని వాపోయారు. సుజాత గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడుతుండటంతో భరించలేక సమస్యను కోర్టుకు వేశామని, అయితే తమపైనే కోర్టులో వేస్తారా అంటూ మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. అదేవిధంగా ఏకాంబర్ రెడ్డి అనే అతని వద్ద రూ.60 లక్షలు అప్పు తీసుకుని వారి ఇంట్లో ఉంటూ బాడుగ అడిగినందుకు మదనపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై రేప్ కేసు పెట్టిందని మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అందరి దగ్గర అప్పులు తీసుకొని ఆమె దుబాయ్ వెళ్లిపోయిందని, పులివెందులలో కూడా ఆమెపై కేసు ఉందని వారు వివరించారు. జిల్లా పోలీసులు విచారించి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా మృత్యుంజయేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మదనపల్లెఅర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మచెరువు మిట్టలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కంచి కామకోటి పీఠాధిపతులచే స్వామివారి నూతన విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో పద్మశాలి సేవా సంఘం, ఆలయకమిటీ సభ్యులచే హోమాలు, విశేషంగా పూజలు నిర్వహించారు. ఆలయాన్ని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఆలయ ఆవరణంలో ధ్వజస్తంభం, నాగదేవతలు, వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు, పద్మశాలి సేవా సంఘం సభ్యులు పర్యవేక్షించారు.



మృత్యుంజయేశ్వర స్వామి విగ్రహం

పీలేరు ఏఎంసీ పాలకవర్గం నియామకం


పురం రామ్మూర్తి, సురేంద్రరెడ్డి

పీలేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఏఎంసీ గౌరవాధ్యక్షుడిగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, అధ్యక్షుడిగా పురం రామ్మూర్తి(పీలేరు), ఉపాధ్యక్షుడిగా పి.సురేంద్రరెడ్డి (కేవీపల్లె) నియమితులయ్యారు. పీలేరు, కేవీపల్లె మండలాల పరిధిలోని పీలేరు ఏఎంసీకి సభ్యులుగా ఎన్.సుబ్బయ్య (పీలేరు), ఎం.కృష్ణమూర్తి (పీలేరు), పి.రహంతుల్లా(పీలేరు), ఎస్.శివమ్మ(పీలేరు), ఒ.రమాదేవి(పీలేరు), ఎం.సాధన(పీలేరు), ఎం.రజనీ(పీలేరు), ఎన్.అమరనాథరెడ్డి(పీలేరు), కలప రవి (పీలేరు-జనసేన), జి.కిశోర్ నాయుడు(పీలేరు), ఎ.వనిత(పీలేరు), టి.లక్ష్మీకాంతమ్మ(పీలేరు), జి.అనూరాధ(పీలేరు) నియమితులయ్యారు. స్థానిక సంస్థల నుంచి కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ సర్పంచ్ కృష్ణయ్య, పీలేరు పీఏసీఎస్ అధ్యక్షుడు, పీలేరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారిని కూడా సభ్యులుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. నూతనంగా నియమితులైన ఏఎంసీ పాలకవర్గం ఏడాది కాలపరిమితితో ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చంద్రమౌళి


కోసూరి చంద్రమౌళి, నౌషాద్‌అలి

వాల్మీకిపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం నియమితులయ్యారు. కమిటీ చైర్మన్‌గా వాల్మీకిపురానికి చెందిన కోసూరి చంద్రమౌళి, వైస్ చైర్మన్‌గా గుర్రంకొండకు చెందిన షేక్.నైషాద్ అలీ నియమితులయ్యారు. అలాగే సభ్యులుగా బి.జయవర్ధిణి, బి.అనసూయ, ఎస్.బయ్యారెడ్డి, డి.ప్రభాకర్, తాహీర్‌ఆలీ, డి.విజయలక్ష్మి, ఎస్.బాబా జాన్, బి.రాధ, పి.శ్రీనివాసులు, బి.సాలమ్మ, ఎం.భారతి, పి.కాంత రాజు, టి.ముబీన, తదితర సభ్యులు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి


ఉరి వేసుకుని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మదనపల్లెఅర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె, మార్కెట్ యార్డులోని టమోటా వ్యాపారి గదిలో సోమవారం గుర్తు తెలియని వక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. సురేంద్ర అలియాస్ దండుగాడు అని పిలువబడే ఈయన టమోటా మండీల్లో కూలి పనులు చేసుకొంటూ ఉండేవాడని స్థానికుల ద్వారా తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.



అరచేతిలో అన్ని సేవలు

- అందుబాటులోకి వాట్సాప్ గవర్నెన్స్ యాప్
- ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందే అవకాశం
- అవగాహన లేక ఆదరణ కరువు
- విస్తృత ప్రచారం ద్వారానే మంచి ఫలితాలు
- వాట్సాప్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

బద్వేలుటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం దూసుకు పోతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గతంలో ఇ-గవర్నెన్స్ పేరుతో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువచేసిన ప్రభుత్వం ఇప్పుడు వాట్సాప్ గవర్నెన్స్‌కు తెరతీసింది. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ఆవిష్కృతమైన వాట్సాప్ గవర్నెన్స్ ఇప్పటి వరకు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఉన్న కాస్త దూరాన్ని కూడా చెరిపేసింది. మనమిత్ర - ప్రజల చేతులో ప్రభుత్వం పేరుతో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించి ప్రజలకు అనేక రకాల సేవలను అందించనున్నారు. గతంలో సచివాలయాలకు వెళ్లి ప్రజలు అష్టకష్టాలు పడేవారు. ఇప్పుడు మొబైల్ ఉంటే అరచేతి లోనే అన్ని ప్రభుత్వ సేవలను పొందడంతో పాటు సమస్యలపై ఫిర్యాదు చేసే అవకాశాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. మొబైల్స్ వినియోగిస్తున్న వారిలో నూటికి 90శాతం మంది వాట్సాప్‌ను వాడుతున్నారు. ఈ యాప్ ద్వారానే ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువకానున్నాయి.

మనమిత్ర నెంబర్ 9552300009 నెంబర్‌ను మొబైల్‌లో నమోదు చేసుకోవాలి. ఆ నెంబర్‌లో ఉన్న వాట్సాప్‌ను తెరచి హాయ్ అనే ఆంగ్ల పదాలను టైప్‌చేసి పంపిస్తే చాలు 161 పౌరసేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వశాఖలకు సంబంధించిన పనులను, సమస్య లను ప్రజలు తమ ఫోన్ నుంచి నేరుగా పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్‌ను ప్రవేశపెట్టింది. అయితే ప్రజల్లో సరైన అవగాహనలేక ఈ యాప్‌ను ఎలా వినియోగించాలో తెలియక సతమతమవుతున్నారు.

యాప్‌పై అవగాహన పెంచాలి

ఈ యాప్‌పై చాలా మందికి అవగాహన లేదు. అధికారులు దృష్టి సారించకపోవడంతో ఈ యాప్ ఇంకా ప్రజాదరణకు నోచుకోలేదు. కొంత మంది ఈ యాప్‌ను వాడుకుందామని చూసినా సర్వర్ లోపా లు, తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ చాలా మంది తమ అవసరాల కోసం కార్యాలయాలకు పరుగులు పెడుతు న్నారు. ఈ యాప్ ప్రజల్లోకి వెళ్లాలంటే దీనిపై ప్రచారాన్ని విస్తృతం చేయాలి. ఈయాప్‌ల పనితీరు, వాడే విధానంపై అధికారులకు అవగాహన కల్పించాలి.

యాప్‌లో వివరాలిలా..

ఎడ్యుకేషన్ : ఈ యాప్‌కు సంబంధించి విద్యార్థులకు అవసరమైన హాల్‌టికెట్స్‌ను నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతేగాకుండా విద్యా శాఖకు సంబంధించి మరింత సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు.

టెంపుల్ సర్వీసెస్ : మనకు కావాల్సిన దేవాలయాల దర్శనం, రూమ్ టికెట్స్ ఈ యాప్ ద్వారా పొందవచ్చు. ఆలయాల్లో సేవ చేసుకునే ఉద్దేశ్యం ఉన్నవారు కూడా ఈయాప్ ద్వారా ఆ అవకాశాన్ని తెలుసుకోవచ్చు.

గ్రీవెన్స్ సర్వీసెస్ : ఈ యాప్ ద్వారా మనం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే అది ఎంత వరకు వచ్చిందనే దానిపై ప్రోగ్రెస్ రిపోర్ట్ తెలుసుకోవచ్చు.

ఆర్టీసీ సర్వీసెస్ : ఆర్టీసీ బస్సులలో ఎక్కడికైనా ప్రయాణం చేయాలంటే టికెట్స్ బుక్ చేసుకునేందుకు వీలు ఉంటుంది.

హెల్త్‌కార్డు సర్వీసెస్ : ఈ యాప్‌లో ఎన్టీఆర్ వైద్యసేవను పొందవచ్చు. నూతన హెల్త్‌కార్డులను తీసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

రెవెన్యూ సేవలు : ఆదాయ, కులం తదితర ధ్రువపత్రాలను పొందవచ్చు. రెవెన్యూ శాఖలో ఇతర సేవలను కూడా ఈ యాప్‌ను వినియోగించుకొని పొందవచ్చు.

పోలీస్ సర్వీసెస్ : ఏదైనా ముఖ్య డాక్యుమెంట్లు, ఇతర వస్తు వులు కానీ పోగొట్టుకుంటే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసు కోవచ్చు. పోలీసుశాఖ నుంచి ఇతర సేవలను కూడా ఈ యాప్ ద్వారా పొందవచ్చు.

మున్సిపల్ సర్వీసెస్ : నగర పట్టణ పరిధిలోని ప్రజలు కొత్త కొళాయి కనెక్షన్, ట్రేడ్ లైసెన్స్‌లు పొందవచ్చు. అలాగే ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీస్థలం పన్నులు చెల్లించవచ్చు.



బ్రౌన్ గ్రంథాలయం కడపకు వరం : మంత్రి సవిత



భూమి పూజా కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు మాధవి, చైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన దాయకమైన గొప్ప పుస్తక సంపదను కలిగిన బ్రౌన్ గ్రంథాలయం కడపకు వర మని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంజీవరెడ్డిగారి సవిత అన్నారు. సోమవారం ఉదయం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత స్వర్గీయ ఎన్‌టీ రామా రావుదే అన్నారు. 1995లో ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబునా యుడు బ్రౌన్ గ్రంథాలయాన్ని అధికారికంగా ప్రారంభించారని, ఇపుడు నిర్మించబోయే నూతన భవనాన్ని కూడా ఆయన చేతనే ప్రారంభింపజేస్తామన్నారు. వైవీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస రావు మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని కీర్తింపబడిందని, తెలుగు భాషా సాహిత్యాలకు ప్రధాన కేంద్రంగా బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ సహాయ సహకారాలు మరింత అందేలా చూస్తామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కడప అంటే ఇతర ప్రాంత ప్రజలకు చిన్నచూపు ఉందని, కానీ బ్రౌన్ గ్రంథాలయం లాంటి విజ్ఞాన సౌధం ఆ అపనిందను రూపు మాపేలా వెలిసిందన్నారు. గ్రంథాలయంలో ఉన్న తాళపత్ర గ్రంథాలను, ఇతర రాతప్రతులను ప్రత్యేకంగా చూపిస్తూ డాక్యుమెంటరీ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో తెలుగుభాషతో పాటు ఇతర భాషలకు చెందిన గ్రంథాలు అందుబాటులోకి తేవడం వల్ల మరింత విస్తృతికి తోడ్పడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లా డుతూ గ్రంథాలయ నూతన భవన నిర్మాణా నికి ప్రభుత్వ సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలకు బ్రౌన్ గ్రంథాలయం మూల కేం ద్రంగా ఉందని, జిల్లా ప్రజలందరు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంసల హామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడారు. రిజిస్ట్రార్ పుత్తా పద్మ ఆహ్వానం పలుకగా సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి వందన సమర్పణ చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, కడప ఆర్‌డీఓ ఇర్విన్, నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి, మెప్మా పీడీ కృష్ణకుమార్, వైవీయూ పాలక మండలి సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : డీఆర్వో



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చూపకుండా తక్షణం పరిష్కరించాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు అన్నారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో డీఆర్వో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబం ధిత అధికారులు, క్షేత్రస్థాయిలో స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు, పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోగా తప్పకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అందిన విజ్ఞప్తుల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

- కడప నగరం రామచంద్రాపురానికి చెందిన షేక్ హుసేన్ పీరాన్ తనకు 60 ఏళ్లు వచ్చాయని, వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరారు.
- చెన్నూరు మండలానికి చెందిన మహమ్మద్ సలీం తన భూమికి హద్దులు చూపి ఆక్రమణ నుంచి కాపాడాలని విన్నవించారు.
- వల్లూరు మండలం అంబవరం గ్రామానికి చెందిన పి.ఆది నారాయణరెడ్డి తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అభ్యర్థించారు.
- కడప చెమ్ముమియ్యాపేటకు చెందిన గోవిందయ్య తనకు టీటీసీ శిక్షణకు అర్హత ఉన్నా తరగతులకు హాజరు కావడానికి అనుమతి ఇవ్వడం లేదని.. టీటీసీ ట్రైనింగ్ సెంటరు వారిని విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, సర్వే ల్యాండ్ అధికారి మురళీక్రిష్ణ, ఎస్డీపీలు శ్రీనివా సులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా

బ్రహ్మంగారిమఠం, మే 19 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె గ్రామ సమీపంలో ఈనెల 13న ఐదుగురు చిన్నారులు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బాధిత చిన్నారుల కుటుంబం సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. అనంతరం తన సొంత నిధుల నుంచి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున రూ.5లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధైర్యపడవద్దు, టీడీపీ అండగా ఉంటుందని చిన్నారుల తల్లి దండ్రులకు భరోసా ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నాయకులు కానాల మల్లికార్జునరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి, మిల్లు శ్రీను, సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు అమ్మేస్తున్నారు... కాపాడండి'



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మదనపల్లి వాసులు

రాయచోటి (కలెక్టరేట్), మే 19 (ఆంధ్రజ్యోతి): 'రోడ్డు అమ్మేస్తున్నారు... కాపాడండి' అని పీజీఆర్ఎస్‌లో మదనపల్లివాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లి మండలం నక్కలదిన్నె తండాలో ఓ వ్యక్తి 2018లో దాదాపు 42 ప్లాట్లు వేయగా అందులో ఇదే ప్రాంతానికి చెందిన వారు 22 ప్లాట్లు కొనుగోలు చేశారన్నారు. అవి పూర్తిగా రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నామని వారు తెలిపారు. సర్వే నెంబర్ 8/1లో 22 ప్లాట్లకు గాను ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని, ప్లాట్లకు వెళ్లేదారిని కూడా అమ్మేసుకుని అక్కడికి రానివ్వడం లేదన్నారు. విజయకుమార్‌నాయక్, శ్రీరాములు, బాబునాయక్, వేణురెడ్డి, నరేశ్‌నాయక్, గిరిబాబు, ప్రభాకర్‌నాయక్, చుక్కల తండా పెద్ద నరసింహులునాయక్, షరీఫ్ పాల్గొన్నారు.

జీవో 4ను రద్దు చేయాలి : వీఆర్వోలు

రాజంపేట టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా జీవో 4ను విడుదల చేసిందన్నారు. దీనివల్ల వీఆర్వోలకు పని భారం పెరుగుతుందని తెలిపారు. సోమవారం వీఆర్వో సంఘం నేతలు తహశిల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశిల్దారు లవణకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జీవో కారణంగా రాష్ట్రంలో సచివాలయాలు కుదించబడతాయని దీనివల్ల వీఆర్వోలకు పనిభారం పెరుగుతుందన్నారు. కావున జీవోను వెంటనే రద్దు చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన రాణా

కొండాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు తాళ్ల ప్రొద్దుటూరు వైసీపీ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తున్న ముగ్గురిని నెల్లూరుకు వెళుతున్న కారు ఢీకొంది. ఈసంఘటనలో ప్రొద్దుటూరుకు చెందిన రాణా (65) అనే వ్యక్తి మృతి చెందగా, దొమ్మరనంద్యాలకు బాబు, ఓబులేసు గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో తాడిపత్రికి తర లించారు. వీరంతా పుట్టువెంట్రుకల కోసం తాళ్లప్రొద్దుటూరుకు వచ్చి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు గుంతలో పడి వ్యక్తి మృతి



అబల్‌మాజీ మృతదేహం

బ్రహ్మంగారిమఠం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పనుల్లో భాగంగా పని చేస్తుండగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అబల్‌మాజీ (45) అనే వ్యక్తి సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు గుంతలో పైనుంచి జారి కింద పడటంతో మృతి చెందాడు. మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

కేజీపీజీసెట్ ఫలితాలు విడుదల



కేజీపీజీ సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న కందుల విద్యాసంస్థల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని), కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ తదితరులు

సీకేదిన్నె, మే 19 (ఆంధ్రజ్యోతి): కేజీపీజీసెట్ 2కే25 ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు కందుల విద్యాసంస్థల కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరమ్మలు తెలిపారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వారు సంయుక్తంగా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 నుంచి ఈ పరీక్షలునిర్వహించడం జరుగుతోందని.. ప్రతిసంవత్సరం లాగే ఈ ఏడాది కూడా విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. 200 మంది పరీక్ష రాయగా 104 మంది అర్హత సాధించారని, మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ఉచిత విద్యను కల్పిస్తామని తెలిపారు.

ఏఐసీటీఈ అనుమతి : 2025-26 విద్యాసంవత్సరానికి ఎంబీఏ పీజీ కోర్సు ప్రారంభించేందుకు ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి 120 సీట్లకు అనుమతి లభించినట్లు వారు తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మేనేజ్‌మెంట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో అనుమతి పొందామన్నారు. కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరప్రసాద్, కేఎల్ఎంప్రిన్సిపాల్ ఎంవీ రత్నమ్మ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి రాయపాటి నాగరాజు పాల్గొన్నారు.

పేద పిల్లల అవసరాల గుర్తింపునకు సతి కమిటీ

- అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా



కడప రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల పిల్లల అభ్యున్నతి కోసం డిస్ట్రిక్ట్ సతి కమిటీని ఏర్పాటు చేసినట్లు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ సి.ఆసిఫా సుల్తానా పేర్కొన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్‌లో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ డిస్ట్రిక్ సతి కమిటీ పేద పిల్లల అవసరాలను గుర్తించి వారికి తగు న్యాయ సహాయం అందజేస్తుందన్నారు. ఈ కమిటీ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అధికారుల సహకారంతో సర్వే చేయడంతో పాటు ఆధార్ రిజిస్ట్రేషన్ క్యాంప్స్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాలు మే నుంచి ఆగష్టు 15 వరకు కొనసాగుతాయన్నారు. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా పానల్ న్యాయవాదులతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, విద్య, వైద్య, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్, ఆర్గనైజర్స్ తదితర శాఖల అధికారులు పాల్గొని పేద విద్యార్థుల డేటాను సేకరించి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ చొరవ తీసుకుంటుందన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ హెగ్డే, జిల్లా రెవెన్యూ ఆఫీసర్ ఎంవీ నాయుడు, రాయచోటి రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారికి వసంతోత్సవం, చక్రస్నానం



శ్రీవారికి చక్రస్నానం చేస్తున్న పూజారులు

జమ్మలమడుగు, మే 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారికి వసంతోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజకు హాజరైన భక్తులు వసంతోత్సవం ఆడారు. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో శ్రీవారి ఊరేగింపు రద్దు చేసి ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి.. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆలయ పూజారులు చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణం, మహాపూర్ణాహుతి, మహాకుంభప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ హైస్కూలుమైదానంలో రెండో రోజు సోమవారం ఉదయం సీనియర్ విభాగం బండలాగుడు పోటీలు పోటాపోటీగా కొనసాగాయి. ఈ సందర్భంగా కొందరు పందేలు కాశారు. కాగా, మొదటిరోజు న్యూకేటగిరి, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఇందులో బోరెడ్డి కేశవరెడ్డి (పెద్దకొట్టాల), సుంకిసురేంద్ర రెడ్డి (తెలంగాణాకు చెందిన హుజూర్‌నగర్) ఎడ్లు విజేతగా నిలిచి మొదటి బహుమతి గెలుచుకున్నాయి. వీరికి జమ్మలమడుగు పట్టణానికి చెందిన శివకుమార్‌రెడ్డి, కూటమి నాయకులు దేవగుడి శివనారాయణరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి రూ.1.50 లక్షలు అందజేశారు. రెండోస్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులుకు ద్వితీయ బహుమతి కింద రూ.1.20 లక్షలు దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ వారు అందజేశారు. మూడో బహుమతి రామసుబ్బారెడ్డి (హుసేలాపురం, నంద్యాల జిల్లా)కి రూ.90 వేలు మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి అందజేశారు. 4వ బహుమతి రమేష్ బాబు (తాడిపత్రి), ద్వార్శల గురివిరెడ్డి (ప్రొద్దుటూరు)కి రూ.70 వేలను పెద్దదండ్లూరు సర్పంచ్ గువ్వల రామాంజనేయరెడ్డి అందజేశారు. 5వ బహుమతిగా కుందూరు రాంభూపాల్‌రెడ్డి, మాధవరెడ్డి (చిన్నకొమెర్ల, మైలవరం మండలం)లకు రూ.50 వేలను నగళ్లపాటి రవీంద్రకుమార్ అందజేశారు. అలాగే 6 నుంచి 9వ స్థానం వరకు నిలిచిన ఎడ్ల యజ మానులకు బహుమతులు అందజేశారు. పోటీలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో పోటీలు విజయవంతం జరిగాయి.





బండలాగుడు పోటీలు, మొదటి బహుమతి విజేతకు రూ.1.50 లక్షలు అందజేస్తున్న శివనారాయణరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేస్తాం

- మహానాడుకు ఇంటికొకరు తరలిరండి
- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా ఈనెల 22 న మదనపల్లెలో నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మదనపల్లెలో చోటు చేసుకున్న సంఘటన దురదృష్టకరమన్నారు. ఇలా జరగకుండా 22వ తేదీన నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర ఐదేళ్లుగా ఎలా జరిగిందో అలాగే నిర్వహిస్తామన్నారు. ప్రజలు, భక్తులు సహృదయంతో సహకరించాలని కోరారు. టీడీపీ పండుగ అయిన మహానాడు పురస్కరించుకుని ఈ నెల 22 న మదనపల్లె నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమాన్ని సుభాష్ రోడ్డులోని తమ నివాసం వద్ద నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి టీడీపీ కార్యకర్త, నాయకుడు తప్పక హాజరు కావాలని కోరారు. కడపలో జరిగే మహానాడుకు 250 బస్సుల్లో టీడీపీ కార్యకర్తలు తరలి వెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్, మాట్లాడుతూ మహానాడును ఈ సారి కడపలో నిర్వహిస్తున్నారని, మదనపల్లె నియోజకవర్గం నుంచి ఇంటికి ఒకరు చొప్పున మహానాడుకు తరలి రావాలన్నారు. మదనపల్లెలో నిర్వహించే మినీ మహానాడులో పాల్గొనే టీడీపీ కార్యకర్తలు, నాయకుల నిర్ణయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో బాలుస్వామి, సుదర్, రాటకొండ మధుబాబు, ఎస్.ఎం.రఫీ, నవీన్‌చౌదరి, నాదెళ్ల శివన్న, సోమశేఖర్, జంగాల రమణ, ఆర్.శశికుమార్, కత్తి లక్ష్మన్న, చిన్నమహేష్, జానీబాబు, భారతి, రాధమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం: మండలంలోని నరసాపు రానికి చెందిన ఈశ్వరప్పకు సీఎం సహాయనిధి కింద రూ.42 వేలు, ఎర్ర బోయనపల్లెకు చెందిన మునియప్పకు రూ.60వేలు అందజేశారు. మండల కేంద్రంలోని బజారు వీధిలో ఆర్యవైశ్య కమిటీ భవనానికి ఎంపీ నిధుల నుంచి రూ.15 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం స్థానిక జనార్దనస్వామి ఆలయం ప్రక్కన మినరల్ వాటర్ కేంద్రాన్ని ప్రారంభించారు. రాయల్టీపై పశు దాణాను పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ, బద్రీనాథ్ శెట్టి, మధుసూదన్, కాంట్రాక్టర్ రెడ్డెప్పరెడ్డి, స్థానిక రాజేష్, రూపేష్‌రెడ్డి, రమేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరసింహులుశెట్టి, జయకుమార్, చిన్న, నాగభూషణం, గబ్బురి సుదర్శన్ బాబు, దినేష్, సుబ్రహ్మణ్యంశెట్టి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహానాడుకు 12 వేల మంది తరలి రావాలి

- ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి


టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మహానాడు పండుగను విజయవంతం చేసే బాధ్యతను ప్రతి కార్యకర్త ప్రతిష్ఠగా తీసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరు నియోజక వర్గం లోని టీడీపీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మహానాడు జనసమీకరణ సన్నాహాల్లో భాగంగా సోమవారం ఆయన పీలేరులోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం నుంచి కనీసం 12 వేల మంది మహానాడుకు తరలివెళ్లేలా పార్టీ శ్రేణులు సన్నాహాలు చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు తమ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని రవాణా సదుపాయాలు సమకూర్చుకుని ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే పసుపు పండుగకు తరలి రావాలని ఆయన కోరారు. అనంతరం మండలాల వారీగా జన సమీకరణపై నాయకులు, కార్యకర్తలతో సమీక్షించి వారికి గ్రామాల వారీగా లక్ష్యాలు నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల నాయకులు పాల్గొన్నారు.

'ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం'

పీలేరు రూరల్, మే 19, (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని పీలేరు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగం పెంచాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయాలకు పలు సమస్యలపై వచ్చే వారికి అందుబాటులో ఉండి నిర్ణీత గడువులోపు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన విధిగా పాటించాలని ఆదేశించారు. కార్యదర్శులు నిత్యం శానిటేషన్, తాగునీరు, వీధి దీపాలు, మురుగు నీటి కాలువల నిర్వహణ తదితర కార్యక్రమాలపై పర్యవేక్షణ తప్పనిసరన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, కార్యదర్శులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివశంకర్

నేటి నుంచి కలికిరి అంకాలమ్మ జాతర


ఉత్సవ విగ్రహాల మధ్య కలికిరి అంకాలమ్మ

కలికిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ సమీపంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కలికిరి అంకాలమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళ వారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, సాయంకాలం ఊరేగింపు నిర్వహించనున్నారు. బుధవారం సాయంకాలం అమ్మవారికి దివ్వెలు, బోనాలు సమర్పించనున్నారు. రాత్రికి అన్నప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. గురువారం వేకువజాము నుంచి మొక్కుబడులు చెల్లించుకోనున్నారు. మూడు రోజులపాటు వైభవంగా జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ప్రభుత్వ అవసరాల కోసం భూమి గుర్తింపు

పీలేరు, మే 19(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ పరిధిలో వివిధ అవసరాల కోసం సోమవారం తహసీల్దార్ భీమేశ్వర రావు నేతృత్వంలో రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన చేశారు. వేపులబైలు గ్రామ పంచాయతీలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, బీఎస్ఎన్ఎల్ టవర్, అంకాళమ్మ ఆలయం, సోలార్ పవర్ ప్లాంటు కోసం స్థల అవసరం కావడంతో సర్వే నెం.418, 857, 1017(సి)లలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించడం ఈ సందర్భంగా తహసీల్దారు వివరించారు.

టమోటా రైతులను ఆదుకోవాలి

మదనపల్లె అర్బన్, మే19(ఆంధ్రజ్యోతి):టమోటా రైతులను ఆదుకోవాలని, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్ఏ బాషా ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు టమోటా పంటను సాగు చేస్తుండడంతో సాధారణ రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. జాబ్‌కార్డ్ విధానాన్ని రద్దు చేసి నాలుగు శాతం కమిషన్ మాత్రమే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హిందూ సంఘాలపై లాఠీచార్జి దారుణం

మదనపల్లె అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి):హనుమాన్ శోభాయాత్రను అడ్డుకుని లాఠీచార్జ్ చేయడం దారుణమని బీజేపీ జాతీయనేత చల్లపల్లె నరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సొసైటీ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శోభాయాత్రను అడ్డుకునేందుకు పోలీసులు అత్యుత్సాహం కనబర్చారన్నారు. మదనపల్లెలో హిందువులు ఎప్పుడైనా ఆందోళనలు చేసిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. త్వరలోనే హనుమాన్ శోభాయాత్ర తేదీని ప్రకటించి పెద్దగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకుడు గుత్తహరికృష్ణ మాట్లాడుతూ మదనపల్లె పోలీసులు ఉన్నతాధికారులను కూడా పక్కదోవ పట్టించారని ఆరోపించారు. యాత్రలు, ర్యాలీలు నిర్వహించేది ప్రజల్లో చైతన్యం కోసమే అన్నారు. ప్రజలు లేని శ్మశాన దారిలో యాత్ర సాగించాలనడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, పట్టణ మాజీ అధ్యక్షుడు బర్రేపల్లె రవికుమార్, ఆసెంబ్లీ కన్వీనర్ భగవాన్, నాయకులు రామిరెడ్డిగారిపల్లె వెంకటరమణారెడ్డి, పూల నాగరాజ, బాస్కర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, కోసూరి భగవాన్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చల్లపల్లె నరసింహారెడ్డి

ఎస్పీపై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం : ఏబీవీపీ

మదనపల్లె టౌన్: ప్రశాంతంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించుకుంటున్న వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దారుణమని ఏబీవీపీ రాష్ట్ర స్కూల్ కన్వీనర్ సాయిహితేష్ ఒక ప్రకటనలో తప్పుబట్టారు. పోలీసుల అనుమతితో నిర్వహిస్తున్న కార్యక్రమంపై ఎస్పీ అభ్యంతరం తెలపడం దుర్మార్గమన్నారు. కేవలం పోలీసులు సూచించిన మార్గంలో వెళ్లలేదనే కారణంతో ఇలా చేయడం భావ్యం కాదన్నారు. ఇటీవల రాయచోటిలో రెండు మతాలు, మదనపల్లెలో రెండు ఘటనల్లో పోలీసుల తీరు అభ్యంతర కరంగా ఉందన్నారు. ఈ విషయమై రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

మాజీ సైనికుడి కుటుంబానికి న్యాయం చేయండి

మదనపల్లె టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుడికి కేటాయించిన భూమికి ఎన్‌వోసీ ఇవ్వకుండా కొందరు అడ్డంకులు పెడుతున్నారని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని వారణాసి రామసుబ్బమ్మ కుటుంబీకులు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీవో రామచంద్ర ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లె మండలం బీకేపల్లె కాలనీలో మాజీ సైనికుడు వారణాసి రామచంద్రారెడ్డికి ప్రభుత్వం 2003 లో సర్వేనెంబర్ 581/2లో 2.11 ఎకరాలు, 552/1లో 2.88 ఎకరాల భూమి మంజూరు చేసిందన్నారు. కొందరు ఈ భూమిని కబ్జా చేసేందుకు యత్నించగా హైకోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఈ భూమికి ఎన్‌వోసీకి దరఖాస్తు చేసుకుంటే ఎం.మురళి అనే వ్యక్తి రెవెన్యూ అధికారులను లోబరుచుకుని తమకు ఎన్‌వోసీ రానీయకుండా అడ్డు తగులుతున్నాడన్నారు. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు రామసుబ్బమ్మ, బిజేంద్రరెడ్డి అర్జీ సమర్పించారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె గ్రామపంచాయతీలో అక్రమాలు, అవినీతిపై విచారణ చేయాలని ఇది వరకే పలుమార్లు అర్జీలు సమర్పించినా సంబంధిత అధికారులు స్పందించలేదని గ్రామస్థులు జేపీ రమణ, సోమ్లానాయక్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి ఫిర్యాదు చేశారు.తమ సమస్యలు పరిష్కరించాలని మదనపల్లె ఫైబర్ నెట్‌వర్క్ ప్రతినిధులు సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఏపీఎస్ఎఫ్ఎల్ కు పర్మనెంట్‌గా ఒక ఎస్ఏ అధికారిని నియమించాలని, అనుభవజ్ఞులైన సిబ్బందిని నియమించాలని, ఏపీఎస్ ఎఫ్ఎల్ ఆపరేటర్లకు అత్యవసర సేవా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. మొత్తం మీద సబ్‌కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 56 మంది వివిధ అర్జీలు సమర్పించగా, వాటిని ఆయా మండల ప్రభుత్వశాఖల అధికారులకు రెఫర్ చేశారు.


డీవో రాఘవేంద్రకు అర్జీలు ఇస్తున్న ప్రజలు


కలెక్టర్ కార్యాలయం వద్దన నిరసన వ్యక్తం చేస్తున్న మదనపల్లె వాసులు

రోడ్డు అమ్మేస్తున్నారు

రాయచోటి(కలెక్టరేట్): రోడ్డు లేకుండానే ప్లాట్లు అమ్మేస్తున్నారని మదనపల్లెవాసులు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం నక్కలదిన్నె తాండాకు చెందిన ఓ వ్యక్తి ఓ స్థలంలో 40 ప్లాట్లు వేసి అమ్మేశారు. ఆ లేఅవుట్‌లో రోడ్డు కూడా విక్రయించేశాడంటూ 20 మంది బాధితులు కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో ఇక్కడ దాదాపు 42 ప్లాట్లు వేయగా అందులో ఇదే ప్రాంతానికి చెందిన వారు 22 ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నామని ప్రస్తుతం ఆ స్థలంలో ఇళ్ల నిర్మించుకుందామని ప్లాట్లు వెళ్లిచూస్తే రోడ్డు కూడా అమ్మేసినట్లు తేలిందని, ఆ స్థలాల కొనుగోలు చేసినవారు దౌర్జన్యంగా పొల్లాడుతున్నారని వారు కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్ నాయక్, శ్రీరాములు, బాబునాయక్, వేణురెడ్డి, నరేశ్‌నాయక్, గిరిబాబు, ప్రభాకర్‌నాయక్, చుక్కల తాండా ఊరికి పెద్ద నరసింహులునాయక్, షరీఫ్, ఓబుల్‌నాయక్, శ్రీనానాయక్, మోద్దిన్, షబ్బీర్ పాల్గొన్నారు.

జనసేన పార్టీని బలోపేతం చేయాలి

మదనపల్లె, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్మవీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి సమక్షంలో పార్టీ సభ్యత్వ నమోదు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని క్రియా వలంటీర్లు అందరూ సామర్థ్యాన్ని మించి నమోదు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, లీగల్ సెల్ అధ్యక్షుడు అమరనారాయణ, జిల్లా జాయింట్ సెక్రటరీ సనావుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పీలేరు: జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కలప రవి సూచించారు. పీలేరు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు చేయించిన వలంటీర్లకు పార్టీ నుంచి అందిన కిట్లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం, పార్టీ సిద్ధాంతాలు ఉన్న కిట్లను పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ అందజేసి పార్టీ పట్ల నిబద్ధతతో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు మండల అధ్యక్షులు మోహనకృష్ణ, వాల్మీకిపురం అధ్యక్షుడు రెడ్డప్ప, కలకడ అధ్యక్షుడు సుదర్శన్, నాయకులు గురుమోహన్, పవన్, సుబ్బయ్య, దనశేఖర, కామిశెట్టి సుదర్, నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు కిట్లు పంపిణీ చేస్తున్న జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ రాందాస్ చౌదరి

పెద్దమండ్యం: మండలంలో 250 మందిని పార్టీలో చేర్పించిన అప్జల్, ధనంజనేయులు, ప్రకాష్‌రెడ్డిని సోమవారం ములకల చెరువులోని జనసేనపార్టీ కార్యాలయంలో తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ములకలచెరువు : స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం సభ్యత్వ నమోదు చేసుకున్న కార్యకర్తలకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, జనసైనికులు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు ఉత్తమ్‌కుమార్, శంకర పాల్గొన్నారు.

వైభవంగా కోటకొండ గంగమ్మ ఊరేగింపు

తంబళ్లపల్లె, మే 19 ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని సంతేపల్లె వెలసిన కోటకొండ గంగమ్మను సోమవారం పల్లకిపై వైభవంగా ఊరేగించారు. ఈ నెల 21, 22 తేదీల్లో తంబళ్లపల్లె కోటకొండ గంగమ్మ జాతర నిర్వహణ సోమవారం అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించిన పల్లకిపై కొలువుదీర్చారు. పోతురాజును తలపై ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, మేళతాళాల నడుమ మెరవణి చేశారు.


అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

అడుసు తొక్కాల్సిందే..!

- ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు బురదమయం


ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిలిచిన వర్షపు నీరు

తంబళ్లపల్లె, మే 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు ఆది వారం సాయంత్రం కురిసిన వర్షం కారణంగా మడుగులా మారాయి. ప్రభుత్వాసుపత్రి ఆవరణ నుంచి వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం ఏర్పాటు చేయకపోవడంతో నీరు నిలిచి మడుగులా మారుతోంది. దీంతో సోమవారం రోగులు ఇబ్బందులు పడ్డారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణ బురదమయమైంది. ఈ ఆవరణలోనే సచివాలయం, హౌసింగ్ కార్యాలయాలు ఉండటంతో వివిధ సేవల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల్లో నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరు గ్రామాలకు బోర్లు మంజూరు

నిమ్మనపల్లె, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు జడ్పీ నిధులతో 6 బోర్లు మంజూరు చేసినట్లు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ అంబేద్కర్ కాలనీ, కట్టిరెడ్డివారిపల్లె, ఎగువమాచిరెడ్డిగారిపల్లె, రాచవేటివారిపల్లె, చౌకిళ్లవారిపల్లె, తవళం గ్రామాల్లో ఒక్కో బోరు కు రూ.2.5లక్షలు చొప్పున 6 బోర్లు ఆర్డర్లు, చల్లావారిపల్లెలో రెండు పంప్‌సెట్లకు గానూ రూ.2.5లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వీటితో పాటు పైపులైన్లు, మోటార్లు కూడా మంజూరు అయ్యాయని తెలిపారు. ఇప్పటికే అంబేద్కర్ కాలనీ, కట్టిరెడ్డివారిపల్లెల్లో నూతన బోర్లు వేస్తున్నట్లు తెలిపారు.


బోరు వేస్తున్న రిగ్గు

రేపు మదనపల్లెలో విద్యుత్ అదాలత్

మదనపల్లె టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం నిమిత్తం మదనపల్లె ఎస్పీడీసీఎల్ డివిజన్ పరిధిలో రేపు విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర చెప్పారు. స్థానిక ఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే విద్యుత్ అదాలత్‌కు అధ్యక్షుడు, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఆంజనికుమార్, స్వతంత్ర సభ్యురాలు విజయలక్ష్మి హాజరు కానున్నారు. గృహ, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కోరారు.

సోషలిజంతోనే పేదరికం నిర్మూలన

మదనపల్లె టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): సమాజంలో పేదరికం నిర్మూలన సోషలిజంతోనే సాధ్యమని ఎస్ఎఫ్ఐ నాయకుడు వెంకటరావు తెలిపారు. సోమవారం స్థానిక ప్రైవేటు కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదువుకునేందుకు వచ్చిన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఈ సమాజం మారితే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసన్నకుమార్, అశోక్, నరసింహ, రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వాల్మీకిపురం, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం మండల హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ సూచించారు. సోమవారం వాల్మీకిపురం పట్టణంలోని పింగాణి ఫ్యాక్టరీ ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల లోపు ప్రజలందరూ సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం క్షయ వ్యాధి, విషజ్వరాలు తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ ఆఫీసర్ నాగిరెడ్డి, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

పెద్దమండ్యం, మే 19 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని టీడీపీ నేతలు పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేశ్వర్లుకు విన్నవించారు. సోమవారం మండలం లోని నూతనంగా ఆయనతో చర్చించారు. ఇటీవల చోరీ లు అధికమవుతున్నాయని, వాటిని అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అందుకు తమ వంతు సహకరిస్తామని టీడీపీ నేతలు సుమన్ కుమార్, కుటుంబంరెడ్డి చంద్రారెడ్డి, మేకల చలపతి, రెడ్డిబాషా, మస్తాన్, ఫరూక్, రెడ్డిహుస్సేన్, రాజు, సుబ్బయ్య తదితరులు తెలియజేశారు.


ఎస్ఐని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఘనంగా తిరంగా ర్యాలీ

పెద్దతిప్పసముద్రం మే 19 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాదుల శిబిరాలను నాశనం చేసిన భారత సైనికులకు సంఘీభావంగా మండల కేంద్రం లో కూటమి నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేతబట్టి జై జవాన్, జైజవాన్, మురళీనాయక్ అమర్ రహే అని నినదించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న త్రివిధ దళాలు దేశ పరువు ప్రతిష్ఠలను కాపాడాయన్నారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ సంపతికోట కిట్టన్న, మాజీ సర్పంచ్ రియాజ్ అలీఖాన్, ఎంపీటీసీ మాజీ సభ్యులు సూరి, చిన్న, హోల్ సేల్ కమిటీ చైర్మన్ రామ, బీజేపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కార్యం శంకర, కంబాల శ్రీనాథ్, బాస్కర్‌రెడ్డి సుబ్బయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రామప్ప (పెద్దోడు) తదితరులు పాల్గొన్నారు.


తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్న కూటమి నాయకులు

'పుచ్చలపల్లి' జీవితం పేద ప్రజలకు అంకితం

మదనపల్లె అర్బన్, మే19(ఆంధ్రజ్యోతి): సుందరయ్యజీవితం పేద ప్రజలకు అంకితం అని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సోమవారం పుచ్చలపల్లె సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు నిర్మాత, తన యావదాస్తిని పేద ప్రజల సంక్షేమం కోసం అర్పించి, పిల్లలు పుడితే స్వార్థం ఎక్కువ పెరుగుతుందని తన సహచరి లీలమ్మను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించిన త్యాగమూర్తి అన్నారు. వ్యవసాయ కూలీలను శ్రమదోపిడీ నుంచి బయట పడేయడానికి వ్యవసాయ కూలీల సంఘం ఏర్పాటు చేశారన్నారు. పేదల పక్షాన నిలిచిన యోధుడు సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, అశోక్, ప్రసన్న, రమణ, తదితరులు పాల్గొన్నారు.


సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రేపు కలికిరికి మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి బుధవారం కలికిరి రానున్నారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం. కృష్ణప్ప తెలిపారు. బుధవారం ఉదయం 8.35 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి నేరుగా కేవీ పల్లె మండలం నగిరిపల్లె గ్రామానికి 12 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కలికిరి చేరుకుంటారు. 25వ తేదీ ఆదివారం వరకూ ఆయన స్థానిక కార్యక్రమాలకు హాజరవుతారు. అనంతరం ఆదివారం ఉదయం 10 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి అక్కడి నుంచి హైదరాబాదు తిరుగు ప్రయాణమవుతారని కృష్ణప్ప వివరించారు.